https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సారథ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 18 సంచిక : 3 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | శనివారం, సెప్టెంబర్,26, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

### దీన్‌దయాళ్ ఆలోచనలే

## వికసిత్ భారత్‌కు దిక్సూచి

**- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి-అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,25:**స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం



కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

## యూపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చాం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**లక్నో,సెప్టెంబర్,25:**ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు నేరగాళ్లు, మాఫియా శక్తుల రాజ్యమేలుతుండగా.. నేడు పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనుకూలమైన సురక్షిత ప్రాంతంగా రాష్ట్రం అవతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన 'యూపీ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2017లో ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మాఫియా నెట్‌వర్క్‌ను విజయవంతంగా తుదముట్టించారని ప్రశంసించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టం కావడంతోనే పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం పెరిగి, భారీగా పెట్టుబడులు తరలి వచ్చేందుకు అనువైన వాతావరణం ఏర్పడిందని ఆయన వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని స్థిరమైన పాలన దేశానికి అసలైన బలమని అమిత్ షా స్పష్టం చేశారు. వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రజల విశ్వాసాన్ని పొందిన మోదీ.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా దూరదృష్టితో విధానాలను రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి చూపారని పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాత విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సరికొత్త పారిశ్రామిక సంస్కరణలను అమలు చేయడం వల్లే భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రూపాంతరం చెందిందని అమిత్ షా పునరుద్ఘాటించారు.

### ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం..

## రెండు వాహనాల ఢీ, ఆరుగురి మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ధమతరి–కంకేర్ మధ్య జాతీయ రహదారి 30పై మార్కటోలా ఘాట్ సమీపంలో వరి ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రక్కు, డీజే సిస్టమ్‌తో వెళ్తున్న పికప్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు పికప్ వాహనంతో పాటు అందులోని డీజే పరికరాలు కూడా ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.బలోద్ జిల్లాలోని పురూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనాల వేగం తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, ఏడుగురు గాయపడినట్లు బలోద్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రకాంత్ గోవర్ధ ధృవీకరించారు. ప్రమాదానికి సంబంధించిన



పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

## సిక్కింలో విరిగిపడిన భారీ కొండచరియలు

పశ్చిమ సిక్కింలోని రింబి గ్రామంలో గురువారం రాత్రి భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో బురద, రాళ్లు జనావాసాలవైపు దూసుకురావడంతో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. విరామం లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్యాల్‌షింగ్ జిల్లాలోని యక్సోమ్–తాషిడింగ్ ప్రాంతంలో ఈ కొండచరియలు విరిగిపడ్డాయి. విద్యుత్ శాఖకు చెందిన ప్రభుత్వ క్వార్టర్లతో సహా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇలా కొండచరియలు విరిగిపడటం ఇదే మొదటిసారి కాదు. రింబి, దాని చుట్టుపక్కల ఉన్న సింగ్లిటమ్ ప్రాంతాలు గత నెల నుంచి కొండచరియలు విరిగిపడుతూనే ఉన్నాయి. దీంతో ఈ పరిస్థితికి కారణం ఏంటి అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొండచరియలు విరిగిపడటానికి ప్రధాన కారకాలు వర్షం, వాలు, నీటిపారుదల, భూగర్భం అని సిక్కింపై జరిపిన పరిశోధన లో వెల్లడైంది. ఈ ప్రాంతంలో అనేక కొండచరియలు విరిగిపడటానికి వర్షమే తక్షణ కారణం. నీరు నేలలోకి, పగిలిన రాళ్లలోకి



చేరినప్పుడు భూమిలోపల ఒత్తిడి పెరిగి వాలును పట్టి ఉంచే బలం తగ్గుతుంది. ఏటవాలుగా ఉన్న భూభాగంలో ఇది నేల, రాళ్లు కిందికి జారిపడటానికి కారణమవుతుంది. సిక్కిం హిమాలయ పర్వత ప్రాంతం కావడం వల్ల ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. నిటారుగా, కఠినమైన భూభాగం, టెక్టోనిక్ ప్లేట్ కదలికల వల్ల ఇక్కడ భూగర్భ నిర్మాణం సంక్లిష్టంగా ఉంటుంది.

### సీఎం రేవంత్ రెడ్డికి

## 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు -


హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన



కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.

### బాలాపూర్ లడ్డూ వేలం..

## రూ.39 లక్షలకు ప్రణీత్ రెడ్డి సొంతం



హైదరాబాద్, సెప్టెంబర్ 25: భాగ్యనగరంలో ఎంతో ప్రత్యేకత ఉన్న బాలాపూర్ వినాయకుడి లడ్డూనురూ.39 లక్షలకు సామ ప్రణీత్ రెడ్డి దక్కించుకున్నారు. గతేడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ ధర రూ.35 లక్షలు పలుకగా.. ఈ సారి రూ.4 లక్షలు అదనంగా లడ్డూ ధర పలికింది. అర్బన్ గ్రూప్‌కు చెందిన ప్రణీత్ రెడ్డి లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే ఈ వేలం పాటలో మర్రి రవికిరణ్ రెడ్డి (చంపాపేట్), కేవీఏ ఫ్లవర్ మర్చంట్– కందాడ శాలిని వీరేందర్ రెడ్డి (చంపాపేట్), కంచర్ల శివా రెడ్డి ది సుషీ కో– సామ దయానంద్ రెడ్డి ఉ సామ వరణంద్ రెడ్డి(లండన్), జీఎన్ఆర్ డెవలపర్స్ – గడ్డం నవీన్ రెడ్డి (హస్తినాపురం), శ్రీకాంత్– పీఎస్‌కే గ్రూప్, ఇబ్రాం ప్రత్యూష్ (బాలాపూర్) పాల్గొన్నారు. చివరకు రూ.39 లక్షలకు ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. 21 కిలోల బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం 9 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఐదు కంపెనీలు ఉండటంవిశేషం. కేవలం లడ్డూ కోసమేఎన్ఆర్ఐలు బాలాపూర్‌కు తరలివచ్చారు. 1994లోలడ్డూ వేలం పాట మొదలవగా.రూ.450 ధర పలికింది. ఇక అప్పటి నుంచి లడ్డూ ధర అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది రూ.39 లక్షలకు చేరింది. బాలాపూర్ వినాయకుడి లడ్డూను సొంతం చేసుకుంటే సుఖసంతోషాలతో పాటు సిరిసంపదలూ కలుగుతాయని భక్తుల నమ్మకం. లడ్డూ వేలం ముగిసిన అనంతరం బాలాపూర్ గణేశ్ విగ్రహం నిమజ్జనం ఊరేగింపు ప్రారంభమైంది. బాలాపూర్ వినాయకుడిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయనున్నారు.

## పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించండి

### జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయిలో రాష్ట్ర హోదాను పునరుద్ధించాలని కోరుతూ ఇవాళ ఆ రాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఒమర్ అబ్దుల్లా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొన్నది. ట్రెజరీ బెంచీలు, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత.. సీఎం ఒమర్ ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తొలుత 2000 జూన్ 26న, ఆ తర్వాత 2024, నవంబర్ 6వ తేదీల్లో ఇదే సభలో తీర్మానాన్ని పాస్ చేశామని, అయితే తాజా తీర్మానం పట్ల కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయిలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన కోరారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరుతూ 2000 సంవత్సరంలో ఎన్‌సీ నేతృత్వంలోని ఫారూక్ అబ్దుల్లా



ప్రభుత్వం తీర్మానాన్ని అసెంబ్లీలో పాస్ చేసింది. 2019లో రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ 2024లో అసెంబ్లీ తీర్మానించింది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను కల్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హోదాను పునరుద్ధరించాలని ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు..

### వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

**-ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల**

**- ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ**

**- నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,25:**యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే



అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

# గచ్చిబౌలి మాక్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్‌కు ఘన సన్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 24, డీకే చాటింపు: గచ్చిబౌలి టీఎన్జీవోస్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కట్కూరి శ్రీకాంత్ ని ఈరోజు హైదరాబాద్ అబిడ్స్ లోని భీమా భవన్, తిలక్ రోడ్లో వివిధ శాఖల ఉద్యోగులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, బాల నర్సింగ్ రావు, ఆదిత్య, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ప్రసిడెంట్ బాబు, శంకర్, సందీప్, స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ మహేష్, ఆనంద్, ఎస్సీసీ డిపార్ట్మెంట్ ప్రతినిధులు దర్గా, రాజేష్ తదితరులు పాల్గొని కట్కూరి శ్రీకాంత్ కు అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ నాయకులు అమరేందర్, వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, అర్మని రాజు, విజయ్ లక్ష్మి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మహేందర్ రావు పటేల్, అశోక్, సైదులు, సులోచన, రూప, పవర్, కృష్ణ, శీను, క్రాంతి కుమార్, శ్రీకాంత్, రమేష్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి డైరెక్టర్‌గా ఎన్నుకున్న గచ్చిబౌలి టీఎన్జీవోస్ మాక్ హౌసింగ్ సొసైటీ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధి,



సభ్యుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిబద్ధతతో పనిచేస్తానని, సభ్యుల సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన ఎన్నిక సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి, అందించిన అభినందనలు మరియు ఆశీస్సులకు కట్కూరి శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

ఎల్బీనగర్,సెప్టెంబర్ 25( డీకే చాటింపు)నాగోల్ డివిజన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతి సందర్భంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌లి గారు, జీఎస్ఐ డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి గారు, నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ గారు పాల్గొని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి సేవలను, సిద్ధాంతాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశ సమగ్ర అభివృద్ధి, పేదలు మరియు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంత్యోదయ భావనను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశం, సమాజం మరియు ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని ఆయన చూపిన మార్గంలో ప్రతి కార్యకర్త సేవాభావంతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి ఆశయాలను




ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య, బద్దం బాలకృష్ణ గౌడ్, వాస్పరి మల్లేష్, సంజీవరెడ్డి, కాలం శెట్టి లయ, నరేందర్ రెడ్డి, గజ్జల శేఖర్, నల్ల మునేందర్, రాఘవ చారి శ్రీనివాస్, బీజేవైఎం నాగోల్ డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 28 న ఎన్ హెచ్ యం ఉద్యోగుల చలో కమిషనరేట్

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 25(డీకే చాటింపు):ఎన్ హెచ్ ఎం లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని తప్పని పరిస్థితిలో చేస్తున్నామని రాష్ట్ర జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం పథకంలో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 17వేల మంది ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంవత్సరములుగా పని చేస్తున్నామని, చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మా తర్వాత కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ లో చేరిన ఉద్యోగులు వివిధ శాఖలలో పర్మనెంట్ అయ్యారని కాగా మా పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించారు. ఎన్ హెచ్ ఎం పరిధిలో పనిచేస్తున్నప్పటికీ సంపూర్ణ ఆరోగ్య తెలంగాణలో మా వంతు కృషి ఎనలేనిదని కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించామని మాకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆలోచన కూడా చేయక పోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్, లాబ్ టెక్నీషియన్, మెడికల్ అసిస్టెంట్, అటెండర్లు గా వివిధ కేటగిరీ లలో పనిచేస్తున్న తమకు వెంటనే ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఖాళీలు భర్తీ చేసి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. కనీస వేతన చట్టం అమలు చేస్తూ, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఖాళీ ఉన్న స్థానంలో పర్మనెంట్ ఉద్యోగులుగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.




# ఆర్మూర్ ఎమ్మెల్యే ఆస్ట్రేలియా పర్యటన

ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 25 (డీకే చాటీంపు):ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి , బిజెపి అధ్యక్షుడు రామ చంద్రరావు తదితరులు భారత తెలుగు మహాసభలు కోసం ఆస్ట్రేలియా వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డికి భారత తెలుగు మహాసభ ప్రతినిధులు స్వాగతంతెలిపారు. ఆస్ట్రేలియాలోని అతిపెద్దఇన్‌ల్యాండ్ నగరాల్లో ఒకటైన టూవూంబా రీజినల్ కౌన్సిల్ మేయర్ క్రే. జెఫ్ మెక్ డొనాల్డ్ ను శుక్రవారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి కలవడం జరిగింది .ఎమ్మెల్యే మాట్లాడుతూఈసందర్భంగా తెలంగాణ మరియు టూవూంబా ప్రాంతాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, అలాగే వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, వ్యవసాయం మరియు సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను అన్వేషించడం గురించి సానుకూలంగా చర్చించారు .రెండు ప్రాంతాల మధ్య బలమైనఅనుబంధాన్ని ఏర్పరచి, ఈ చర్చలను భవిష్యత్తులో అర్థవంతమైన అవకాశాలుగా మార్చాలని ఆశిస్తున్నాము అనీ అన్నారు.



# ఘనంగా నమామి భారతం వేడుకలు... వందేమాతరం గీతానికి 150 ఏండ్లు పూర్తి...

బెల్లంపల్లి (డీకే చాటింపు )భారత స్వాతంత్ర్య ఉద్యమానికి జీవం పోసిన వందేమాతర గీతానికి 150 సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా విద్యాభారతి,అఖిల భారత విద్యాసంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం తిలక్ స్టేడియంలో నిర్వహించిన “నమామి భారతం” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వందేమాతరం గీతం ప్రతి ఒక్క దేశ భక్తుని నరనరాల్లో ఉండి పోయిందని అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం పలు పాఠశాల ల విద్యార్థిని, విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమం లో బెల్లంపల్లి ట్రాస్మా అధ్యక్షులు బగ్గని శేషు కుమార్, ప్రతినిధులు రాజలింగు, విద్యాభారతి సంస్థ ప్రతినిధులు పుల్లూరి వెంకటేష్, ప్రశాంత్, భాగ్యలక్ష్మి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు కంటే వాడ నగేష్, తదితరులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ నగరంలో వినాయక నిమజ్జనం బందోబస్తు లో పోలీస్ కమిషనర్





నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (డీకే చాటింపు):నిజామాబాద్ నగరంలో వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా పండుగ వాతావరణం లో నిర్వాహకులు జరుపుతున్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో రథయాత్ర ప్రారంభించి గణేష్ నిమజ్జనం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో బందోబస్తు ఏర్పాటులను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. దుబ్బ రథయాత్రను సందర్శించారు. జిల్లాలో 5811 మండపాలలో వినాయక ప్రతిష్ట చేశారని, ఇలా ఉండగా నిమజ్జనం కొరకు బందోబస్తులో 1300 మంది పోలీసులు పాల్గొంటున్నారని కమిషనర్ వివరించారు. నిమజ్జనం యాత్రలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులు కూడా పూర్తిగా సహకరించి ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. రథయాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్యే, మేయర్‌నగరంలోని దుబ్బలో వినాయక నిమజ్జన రథయాత్రను టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నగర ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ మేయర్ ఉమారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన రథయాత్రకు శ్రీకారం చుట్టారు. వినాయక నిమజ్జన రథయాత్రలో భక్తులు, స్థానికులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, భక్తి శ్రద్ధలతో రథయాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా నగరంలో భక్తి వాతావరణం నెలకొంది.

# కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నూతన ఆడిటోరియంకు సెప్టెంబర్ 26న భూమిపూజ



కరీంనగర్, సెప్టెంబర్ 25 (డికె చాటింపు ) : కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నూతన ఆడిటోరియం నిర్మాణానికి ఈ నెల 26న శనివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు డా. పొన్నం రవిచంద్ర, కార్యదర్శి కె. లక్ష్మి గౌతమ్ తెలిపారు. కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ ఈ ఏడాదితో 49 వసంతాలు పూర్తి చేసుకుని, వచ్చే ఏడాది గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించుకోనున్న సందర్భంగా కరీంనగర్--సిరిసిల్ల బైపాస్ రోడ్డు, పద్మనగర్ వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అన్ని హంగులతో నూతన ఆడిటోరియం నిర్మించనున్నట్లు వారు పేర్కొన్నారు. గత 49 సంవత్సరాలుగా ఫిల్మ్ సొసైటీ సమాంతర సినిమాలను ప్రదర్శించడంతో పాటు బాలల చలన చిత్రోత్సవాలు, వివిధ ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఫిల్మ్ భవన్ వేదికగా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు 'చిన్నితెర' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కళాకారులకు మార్గదర్శనం అందిస్తోందన్నారు. అలాగే '24 ఫ్రేమ్స్' పోటీలను నిర్వహిస్తూ నూతన ప్రతిభను వెలికితీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు నూతన ఆడిటోరియం నిర్మాణం చేపడుతున్నామని, ఇది కళాకారులు, సినీ ప్రియులు, సాహితీ, సాంస్కృతిక రంగాలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. భూమిపూజ కార్యక్రమానికి కపిసో సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆత్మీయ అతిథిగా, కార్పొరేటర్లు ఎం. రాజేందర్, గడ్డి ప్రదీప్, పద్మనగర్ మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, కపిసో సలహాదారు వరాల మహేష్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. అలాగే వినియోగదారుల మండలి, వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థల బాధ్యులు, కవులు, రచయితలు, ఔత్సాహిక కళాకారులు, సినీ ప్రియులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని డా. పొన్నం రవిచంద్ర, కె. లక్ష్మి గౌతమ్ కోరారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో

# నగరంలో నూతన గ్రంథాలయం

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 25( డీకే చాటింపు )నిజామాబాద్ నగరంలో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవనానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా నూతన గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన పుస్తకాలు, డిజిటల్ వనరులు అందుబాటులోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో అవసరమని ఆయన అన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దు తాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ప్రపంచం అరచేతిలోకి వచ్చిందని, వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పిన విషయాలు నేటి పరిస్థితుల్లో మరింత ప్రాసంగికంగా కనిపిస్తున్నాయని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం యువతపై పెరుగుతున్న నేపథ్యంలో దాని వినియోగంలో విచక్షణ అవసరమని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సోషల్ మీడియాను కేవలం వినోదానికి పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగించుకోవాలని యువతకు సూచించారు. యువతకు గ్రంథాలయాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు సంబంధించిన సమాచారాన్ని గ్రంథాలయాల ద్వారా పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. నూతనగ్రంథాయం నిజామాబాద్ పట్టణంలోని విద్యార్థులు, యువతతో పాటు ప్రజలందరికీ విజ్ఞాన కేంద్రంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రంథాలయ నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు కాసిపేట గురుకుల విద్యార్థుల ఎంపిక...

బెల్లంపల్లి (డీకే చాటింపు )మందమర్రి లోని సెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్లో నిర్వహించిన ఎస్. జి. ఎఫ్ అండర్- 19 ఫుట్ బాల్ పోటీలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట విద్యార్థులు ఎం.విగ్నేశ్వర్, జి. కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా ప్రిన్సిపాల్ పూటూరి సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లా ఎస్. జి.ఎఫ్ సెక్రటరీ బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో కూడా ఇదే క్రీడాస్ఫూర్తితో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిడి కె. హరిష్ , పిఇటి ఎ. రాజేందర్ మరియు విద్యార్థులు పాల్గొని ఎంపికైన క్రీడాకారులను అభినందించారు



డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం, సెప్టెంబర్,26, 2026

# అన్ని వివక్షలనూ తొలగించేలా వుండాలి

ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను అరికట్టేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) జనవరి 13న 'ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక నియమావళి-2026? (హెచ్.ఇ.ఐ.ఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రధాన ఉద్దేశం మతం, జాతి, లింగం, జన్మస్థలం, వైకల్యం ఆధారంగా వివక్ష లేకుండా చూడటం. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక బలహీన వర్గాల పట్ల వివక్షను, కుల ఆధారిత వివక్షను నిలువరించడం దీని లక్ష్యం. వివక్షకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం జరిగిన పోరాటాలవల్ల ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి. అంతేగాని, ఇవేవీ బహుమతిగా వచ్చి పడినవి కాదు. ఈ మార్గదర్శకాలు పెద్ద చర్చకే దారితీశాయి. ఉన్నత వర్గాలవారు తీవ్రంగా నష్టపోతారని కొందరు?' ఇప్పటికే 2012 మార్గదర్శకాల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి సెల్స్ ఉన్నాయి. మరి ఈ నూతన నిబంధనలు ఎందుకని?' మరికొందరు వాదిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ సిటీ మేజిస్ట్రేట్ అధికారి అలంకార్ అగ్నిహోత్రి ఏకంగా తన పదవికే రాజీనామా చేశారు. పలు సవరణలు చేయాలని కొందరు కోరుతున్నారు. అసలు ఈ మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? నిజంగా వీటి ద్వారా విద్యాసంస్థల్లో వివక్షను పోగొట్టగలమా? వీటి అమలు ఎలా ఉండబోతోంది? మరోవైపు సుప్రీంకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. వాదనలు విన్న కోర్టు స్టే విధించింది. దీనితో నూతన మార్గదర్శకాలలో ఎటువంటి మార్పులు జరుగుతాయనేది పెద్ద ప్రశ్నగానే మారింద్ని. దేశంలో వివక్ష ఈ నాటిది కాదు. కులం పేరుతో, జాతి పేరుతో, లింగం పేరుతో వందల ఏళ్ళగా వివక్ష కొనసాగుతున్నది. వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే నమ్మగలమా? కానీ ఇది అక్షర సత్యం. పుట్టుకనే ఒక "ఘోర ప్రమాదం"గా అభివర్ణించి వారిని ఆత్మహత్య చేసుకునే విధంగా పురికొల్పుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేములపై ఇటువంటి దారుణమే జరిగింది. ముంబై లోని బివైఎల్ నాయర్ హాస్పిటల్‌లో పి.జి వైద్య విద్యార్థిని పాయల్ తాడ్వి గిరిజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అవడంతో తోటి డాక్టర్ల వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. దర్శన్ సోలంకి కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. సోలంకి 2023 ఐఐటి బాంబేలో మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థి. తన కులం తెలిసిన తర్వాత తోటి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని, వివక్ష ఎదురవుతోందని కుటుంబ సభ్యులతో వాపోయిన కొద్దిరోజులకే ఆత్మహత్య చేసుకున్నారనే అంశాలకు కోర్టు విస్తుపోయింది. నూతన ఆలోచనలకు కేంద్రాలుగా ఉండాల్సిన విద్యాసంస్థలు కుల వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం చేదు నిజం. ఇలాంటి కేసులపై కోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా యుజిసి మార్గదర్శకాలు తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2014 నుండి 2021 మధ్య కాలంలో ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల్లో 122 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, వారిలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నారు. యుజిసి గణాంకాల ప్రకారం ఈ దశాబ్ద కాలంలో కుల వివక్ష ఫిర్యాదులు 118 శాతం పెరిగాయి. విద్యార్థుల నమోదులో 14 శాతం ఎస్‌సి వర్గాల విద్యార్థులు ఉంటే, అధ్యాపక వృత్తి వచ్చేసరికి కేవలం 6 శాతానికి పడిపోతోందని అఖిల భారత ఉన్నత విద్యా సర్వే-2025 (ఎ.ఐ.ఎస్.హెచ్.ఇ) గణాంకాలు చెబుతున్నాయి. 2012 మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే అనేక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి సెల్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, గ్రీవెన్స్ పోర్టళ్లు ఉన్నాయి. అయినప్పటికీ ఇన్ని వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వాటి అమలు అసంబద్ధంగా ఉండవే ఇందుకు ప్రధాన కారణం. యూనివర్సిటీలు, కాలేజీల్లో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అండగా ఉండటమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఇప్పటికే యుజిసి స్పష్టం చేసింది. అయితే దీని ప్రకారం దేశంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో 'ఈక్వల్ ఆపర్చునిటీ సెంటర్' (ఇ.ఒ.సి) ఏర్పాటు చేయడం తప్పనిసరి. వివక్షపై ఫిర్యాదులకు 24గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. విచారణ గడువు లోపల ముగించాలి. దోషులుగా తేలితే శిక్షలు కఠినంగా అమలు చేయాలి. అవసరమైతే సంస్థలకు గుర్తింపు రద్దు చేయాలి. లేదా నిధులను ఆపేయాలి.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు
ప్రతీకగా నిలిచిన
డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# కరీంనగర్ కళా వైభవం



మానేరు తరంగాల మాధుర్యంలో...
మట్టి పరిమళాల పరవశంలో...
అక్షరాల వెలుగులు విరిసిన నేల ఇది...
కళల కాంతులు నిండిన నేల ఇది...
కరీంనగర్ --- కళా సాహిత్యాల కోవెల ఇది!
అక్షరాన్ని ఆయుధంగా మలిచిన కవులు,
భావాన్ని భాషగా పలికించిన రచయితలు,
రంగస్థలంపై రక్తికట్టించి పాత్రలకు ప్రాణం పోసిన కళాకారులు,
తెరపై తెలంగాణ జీవన చిత్రాన్ని ఆవిష్కరించిన సినీ సృజనకారులు
ఎందరో మహానుభావుల అడుగుజాడలతో
వెలిగిన సాంస్కృతిక గడ్డ... కరీంనగర్!
పల్లె పలుకుల్లో పాటై,
ప్రజల గుండెల్లో మాటై,
జానపద గీతాల్లో జీవమై,
రంగస్థల రాగాల్లో రసమై,
తెలంగాణ తల్లికి తిలకమై
కళా వైభవాన్ని చాటిన నేల ఇది!
కవిత్వం కదిలితే...
కథలు పుడతాయి!
కళాకారుడు కదిలితే...
రంగస్థలం వెలుగుతుంది!
కెమెరా కన్ను తెరిస్తే...
కాలం కథగా మారుతుంది!
ఇప్పుడు...
ఆ కళకు ఒక చిరునామా,
ఆ సృజనకు ఒక శాశ్వత వేదిక,
ఆ కలలకు ఒక కొత్త ఆకాశం---
ఖానాఖీ×గూగా ఆడిటోరియం!
భూమిని తాకిన ఈ తొలి ఇటుక
భవనానికి పునాది మాత్రమే కాదు...
భావితరాల కళా స్వప్నాలకు పునాది!
ఈ భూమిపూజ మంత్రాక్షరాల్లో
రేపటి రంగస్థల గర్జన వినిపించాలి...
ఈ పునాది రాయిలో
రేపటి సినిమాల కథలు మొలకెత్తాలి...
ఈ వేదికపై
కవిత్వం పలకాలి...
సంగీతం పరవశింపజేయాలి...
నాటకం జీవించాలి...
సినిమా స్ఫూర్తినివ్వాలి!
కరీంనగర్ గడ్డపై
కళకు కిరీటం...
సాహిత్యానికి సింహాసనం...
సృజనకు స్వేచ్ఛా ఆకాశం...
కళాకారుల కలలకు
కలల కోటగా నిలవాలి ఖానాఖీ×గూగా!
నిన్నటి వారసత్వాన్ని మోస్తూ...
నేటి సృజనకు ఊపిరినిస్తూ...
రేపటి తరాలకు దారిచూపుతూ...
కళ వెలిగే దీపమై...
సాహిత్యం పలికే స్వరమై...
సినిమా నడిచే దారై...
కరీంనగర్ కళా వైభవం
తరతరాలకు చిరంజీవిగా నిలవాలి!
భూమిపూజతో మొదలైన ఈ మహా ప్రస్థానం
కళా చరిత్రలో ఒక కొత్త అధ్యాయంగా మారాలి!
ఒక్క మాటలో చెప్పాలంటే...
కళకు వేదిక...
సాహిత్యానికి నిలయం...
రంగస్థలానికి ఊపిరి...
సినీ సృజనకు చిరునామా...
కరీంనగర్‌కు కళా వైభవ కిరీటం ---
ఆడిటోరియం!

**సదానంద్ శ్రీమంతుల (సదాశ్రీ)**
**జర్నలిస్ట్, సినీ నటుడు, రచయిత**
**కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు**

# జర్నలిస్ట్ వనం భాస్కర్ కు ఘన నివాళి అర్పించిన జర్నలిస్టులు

హన్మకొండ (డి కె చాటింపు ) అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వనం భాస్కర్ కుటుంబానికి ప్రెస్ క్లబ్ నుండి 25,000/- రూపాయలు సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆ కుటుంబానికి క్లబ్ నుండి 20వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది. భాస్కర్ మృతి దురదృష్టకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరుకొప్పుల నరేందర్, వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, కమటం వేణు గోపాల్, సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాస్, అడుప మహేష్, జన్ను స్వామి, కందుల శ్రీధర్, పెరుమాండ్ల మధు, బండి రవి, మోహన్,



చినబాబు, నీలం శివ, ఉమాశంకర్, పాషా, అక్రం, రాజేశ్, శ్యాం, గంగరాజు, కృష్ణాకర్, సాయి, తదితరులు ఉన్నారు.

# అంధ, మానసికదివ్యంగులకు స్నేహ సొసైటీ చేస్తున్న సేవలు వెలకట్ట లేనివి

## నగర మేయర్ ఉమారాణి



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (డీకే చాటింపు): అంధ,మానసిక దివ్యంగా విద్యార్థులకు నేనున్నానంటూ మనోధైర్యం కల్పిస్తూ వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్న స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి సేవలు వేల కట్టలేనివని నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి అభినందించారు. పండిత్ ధిన్ దయాళ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా స్నేహ సొసైటీలో జరిగిన కార్యక్రమంలో నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి మరియు నుడా చైర్మన్ కేశ వేణు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మానసిక దివ్యంగ విద్యార్థుల ఉన్నతి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారుచెప్పారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యంగుల పాఠశాల ఆవరణలో పండిత్ దీన్ దయాల్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా స్నేహ సొసైటీ ఏర్పాటు ఏ విధంగా జరిగింది.. ఇప్పటి వరకు ఎంత మంది దివ్యంగ విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు మరియు వారి ఆరోగ్య పరిస్థితులను ప్రతి విషయాన్ని స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి క్లుప్తంగా ముఖ్య అతిథులకు,పలు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందికి వివరించారు. సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వారు మాట్లాడుతూ స్నేహ సొసైటీని 1995 లో నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసి నిర్వహించడం మేము చూడడం జరుగు తుందన్నారు.. అయితే నాటి నుండి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఎంతోమంది



దివ్యాంగ విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడడం జరగడం స్నేహ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్. సిద్ధయ్య, జ్యోతి దంపతులకే దక్కిందన్నా రు. అలాగే అంధ, మానసిక, దివ్యంగ విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపుతూ నేనున్నానంటూ ఆకున్న చేర్చుకొని వారి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తు బంగారు బాటాలు వేస్తూ కృషి చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. స్నేహ సొసైటీ దివ్యాంగ విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలతో పాటు జిల్లాను గర్వించదగ్గ స్థాయిలో ఉంచారని కొనియాడారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి రావడం పట్ల దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు తిలకించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. దివ్యంగా విద్యార్థులు అయినప్పటికీ కూడా వారు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గురించి లూయీ బ్రెయిలీ ద్వారా నేర్చుకున్న వారి జీవిత చరిత్రను మరియు ఇతర విషయాలను క్లుప్తంగా వివరించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కంటిచూపు లేనప్పటికీ స్పర్శ ద్వారా చదువుతోపాటు సాంస్కృతిక నృత్యాలు, పాటలు , యోగ చేయడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. ఇంతగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్నేహ సొసైటీ నిర్వాహకులు, ఉపాధ్యాయ సిబ్బందిని ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైతం ప్రదర్శనలు నిర్వహించారు..ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికాలతో ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే రమేష్, రాజేశ్వరి, నుడా చైర్మన్ కేశ వేణు అందుల ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయబృందం,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బైరామల్ గూడ డివిజన్ (హస్తినాపురం) జెడ్పీ రోడ్డు ఆర్ఎస్ఎస్ జంక్షన్ వద్ద పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహణ

ఎల్బీనగర్, సెప్టెంబర్ 25 (డీకే చాటింపు) బైరామల్‌గూడ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డివిజన్ ప్రధాన కార్యదర్శి గౌని వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కంది శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బొగ్గుల మాధవరెడ్డి మాట్లాడుతూ .. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గొప్ప జాతీయవాది, దేశభక్తుడని, సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే అంత్యోదయ సిద్ధాంతాన్ని బలంగా విశ్వసించిన మహనీయుడని కొనియాడారు. దేశంలోని చివరి వ్యక్తి అభివృద్ధి చెందాలనే గొప్ప ఆలోచనతో ఆయన జీవితాంతం పనిచేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొగ్గుల మాధవరెడ్డి, జనరల్ సెక్రటరీ అమర్నాథ్ రెడ్డి, గౌని వెంకటేష్ గౌడ్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు వెంకటాచారి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రాజవర్ధన్ రెడ్డి, మహిళా




మోర్చా నాయకురాలు విజయశ్రీ చౌదరి, లక్ష్మీకాంత్ రెడ్డి, మణి గౌడ్, నరేష్, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతఃహో



పంచభూతాలు సృష్టించబడిన ఫోటో..
నేటి ఫోటో.
ఒకటి భక్తి
ఇంకొంటి అభిమానం
మరొకటి పరిపాలనా సౌధం..హైదరాబాద్ హుస్సేన్ సాగర్ లో వినాయకుని నిమజ్జన టైంలో తీసిన ఫోటో

# ఆర్మూర్ పట్టణ కన్యకా పరమేశ్వరి దేవీఆలయంలో విశేష పూజలు



ఆర్మూర్ సెప్టెంబర్ 25 (డీకే చాటింపు )...ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ఆర్య వైశ్య సంఘము ఆధ్వర్యంలో శ్రీ కన్యాకాపరమేశ్వరిదేవి ఆలయంలో వినాయక మండపంలో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతశీ శుక్రవారం భక్తులు విశేష పూజాకార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవి నవరాత్రుల/శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ విగ్నేశ్వరుడి యొక్క ఆశీస్సులు అందరి పై ఉండాలని సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు పండాలని కోరారు ఈ కార్యకమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, (డీకే చాటింపు) చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటివరకు సెప్టెంబర్ 25 వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ సీఈఓ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీల్డ్ స్థాయి అధికారులు విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపోతున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించింది. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# ఉమ్మెడ బ్రిడ్జి వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (డీకే చాటింపు): నేడు గణేష్ నిమజ్జనం సందర్భంగా నందిపేట్ మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గోదావరి నదిలో గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ముఖ్యంగా భారీ గణేష్ విగ్రహాలను గోదావరి నీటిలో నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు , భక్తులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎవరూ ప్రమాదకరంగా నీటిలోకి వెళ్లకుండా చూడాలని , పోలీస్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు , సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు , ట్రాఫిక్ నియంత్రణ , పార్కింగ్ మరియు ప్రజల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంలో భారీ వినాయకుల నిమజ్జనం కోసం భారీ క్రేన్లను ఏర్పాటు చేయడం జరిగింది. అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , సిటిసి ఎసిపి రాజశేఖర్ , ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి , నందిపేట్ ఎస్సై ఎన్. వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ముగింపు వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య



బెల్లంపల్లి(డీకే చాటింపు )కాల్‌టెక్స్ కెమికల్ ప్రాంతంలోన హనుమాన్ మందిరంలో గణేష్ నవరాత్రుల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి సహస్రనామ అభిషేకం, పవిత్ర హోమం, అన్నదాన కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, గణపతి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ భక్తిమయ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని కృపాకటాక్షాలను పొందారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలపై గణపయ్య కృప ఎల్లవేళలా ఉండాలని, విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు నిండాలని దుర్గం చిన్నయ్య గణనాథుని ప్రార్థించారు.

# క్యూర్ కు 28 శాతం మార్కులే

**హైదరాబాద్:** 70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్‌ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది. హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది. నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు.

# భారత్ కు జిన్ పింగ్

**న్యూఢిల్లీ :** 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్?చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12?13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది. గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్?చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది. భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై? అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

# గ్రాస్ రూట్ కు దూరంగా కవిత...




**హైదరాబాద్,** : మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా" అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదుఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచీ విద్యార్థుల విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. ఆ పార్టీ ఎలాంటి ఉద్దేశ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ ఆందోళనలకు బహిరంగంగానే తన సంఘీభావం తెలిపింది. పార్లమెంటు లోపల, బయట విద్యార్థుల తరపున గట్టిగా పోరాడింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నేతలు అందరూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు కూడా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొన్నారు. కనుక విద్యార్థుల ఆందోళనలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక భాగస్వామి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

# అక్రమ పార్కింగ్ పై కఠిన చర్యలు

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) శంకర్ నాయక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట రహదారి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారుల వెంట ఉన్న భోజనశాలలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారి పక్కన నిలిపిన వాహనాలకు వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, నిలుపుదల దీపాలు, హెచ్చరిక త్రిభుజ గుర్తులు లేకపోవడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. డ్రైవర్లు, వాహన యజమానులు తప్పని సరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం?1988, సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై అకారణంగా లేదా ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపి వేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. అలాంటి వాహనాల ఛాయాచిత్రాలు, దృశ్యాల ఆధారంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలు నిలిపివేయరాని ప్రాంతాల్లో వాహనాలను నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలను వదిలేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కఠిన చర్యలు తప్పవన్నారు. రవాణా శాఖ సూచనలు మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులు మినహా వాహనాలను నిలిపి వేయరాదు. వాహనాలను భోజనశాలలు, హోటళ్ల ముందు లేదా రహదారి అంచున ప్రమాదకరంగా నిలిపివేయరాదని, తప్పని సరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షితమైన దూరంలో మాత్రమే నిలిపివేయాలని, వాహనం వెనుక భాగంలో ఎరుపు ప్రతిబింబించే పట్టీలు లేదా ప్రతిబింబించే పలకలు, ప్రతిబింబించే పట్టీ, నిలుపుదల దీపాలుతప్పనిసరిగా ఉండాలి. రాత్రి సమయంలో ప్రతిబింబించే హెచ్చరిక త్రిభుజ గుర్తు ఏర్పాటు చేయాలని, వాహనాల సాంకేతిక సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్), బ్రేకులు, టైర్లు, దీపాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలి. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం,నిర్లక్ష్యంగా వాహనం నడపడం పూర్తిగా నివారించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం ద్వారా ఒక ప్రకటన ద్వారా తెలపడంజరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారులపై డీటీవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ, "మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే రెండు జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన లక్ష్యం. వాహన యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

# ఇంకా తేలని రాష్ట్రాల పంచాయితీ పుష్కర కాలమైన బదిలీ కాని ఆస్తులు

**హైదరాబాద్:** రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లైనా ఇంకా రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ భవనాల పంపకాలు పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను ఆంధ్రప్రదేశ్ సర్కా?ర్ ఇంకా తెలంగాణకు అప్పగించలేదు. కొన్ని భవనాలను ఖాళీ చేసినప్పటికీ వాటిని అప్పగించలేదు. మరికొన్ని భవనాల్లో ఏపీ ఉద్యోగులు కొనసాగుతున్నారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ సహా కీలక ఆస్తుల బదిలీ కూడా పెండింగ్‌లోనే ఉంది. ఆస్తుల విభజన, నదీ జలాల పంపకం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పుష్కర కాలం పూర్తి అయిపోయింది. హైదరాబాద్ నగరం ఉమ్మడి రాజధానిగా 10 ఏళ్ల పాటు కొనసాగింది. ఆ గడువు కూడా తీరిపోయి 2 ఏళ్లు గడిచింది. అయితే ఈ 12 ఏళ్లు పూర్తి అయినా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన అంశం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ మధ్య పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ భవనాల బదిలీ ముందుకు సాగడం లేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం హైదరాబాద్‌లోని మొత్తం 2,565 ప్రభుత్వ భవనాల్లో 589 భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. మిగిలిన 1,976 భవనాలను తెలంగాణకు అప్పగించారు. అయితే ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత ఈ భవనాలను తెలంగాణకు అప్పగించాలని అప్పుడే తేల్చి చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు.



పాటిగడ్డ, బంజారాహిల్స్, కుందన్‌బాగ్, ఎర్రమంజిల్, సైఫాబాద్, మలక్‌పేట్, ఖలాదేరా, మదన్నపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ భవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మొత్తం 589 భవనాల్లో 221 భవనాల్లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా.. మరో 368 భవనాలను వారు ఖాళీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా అప్పగించలేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు 2024 జూలై 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం అయి చర్చించారు. అనంతరం అధికారులు, మంత్రుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు.

# రేవంత్ కు గ్రేటర్ కలవరం




**హైదరాబాద్,** : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే మంచినీటి సరఫరా కూడా వేసవిలో సక్రమంగా అందకపోవడంతో నగరవాసులు ఒకింత అసంతృప్తితో ఉన్నారంటున్నారు మరొకవైపు హైడ్రా అంశం కూడా కీలకంగా మారింది. హైడ్రా అధికారులు ఆక్రమణలు కూల్చివేయడంతో అనేక మంది తమ నివాసాలను కోల్పోయారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపిస్తున్నారు. మరొకవైపు మూసీ రిజర్వాయర్ ప్రక్షాళన పనులు ప్రారంభిస్తామని చెప్పడం, సర్వేలు చేయడం వంటివి కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటం, కాంగ్రెస్ ఏ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను సాధిస్తుందన్న ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. బీజేపీ హిందుత్వ నినాదంతో వెళుతుండటం, మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సన్నిహిత్వంపై ప్రశ్నిస్తుండటం కూడా కాంగ్రెస్ ను కొంత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కలవరానికి గురి చేస్తున్నాయని చెప్పక తప్పదు.

# డిఫెన్స్ లో మోడీ....

**న్యూఢిల్లీ :** కేంద్రంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల జెన్ జీ ఆందోళనను ఆసరా చేసుకుని రాహుల్ కేంద్రంపై విరుచుకు పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మ్యాగ్జిమం ప్రెషర్ వ్యూహాన్ని రెడీ చేసుకున్నారు. జెన్–జీ విద్యార్థుల నిరసనల తీవ్రతకు, ప్రతిపక్షాల వరుస ఆందోళనలకు లొంగి కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించారు. ప్రధాని మోదీ హయాంలో కేంద్రం ఇంతటి తీవ్ర ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పరిణామాన్ని తమకు లభించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ద్వయం.. ఇప్పుడు తమ దాడులను నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపైకి మళ్లించారుపార్లమెంట్ లోపల, బయట రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తూ రాజకీయ వేడిని పెంచారు. విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల చర్యలను ప్రస్తావి విద్యార్థుల శరీరంపైకి పెల్లెట్లు, బుల్లెట్లు వేయించింది అమిత్ షానే అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సభలో మాట్లాడేందుకు పూర్తి అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బయటకు వచ్చి విలేకరుల సమావేశం పెట్టి, జెన్–జీ తరాన్ని రెచ్చగొట్టేలా నేరుగా హోంమంత్రినే టార్గెట్ చేయడం ప్రతిపక్షం మార్చుకున్న దూకుడు వైఖరికి నిదర్శనం. సభలో ప్రియాంక గాంధీ సైతం ఇదే తరహా దూకుడును ప్రదర్శిస్తుండటంతో.. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఎటాక్ మోడ్‌లోకి వెళ్లగా, అధికార పక్షం కౌంటర్ ఇచ్చుకోవడానికి కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ప్రధాన్‌ను మార్చేసినట్లుగా ప్రధానిని మార్చేస్తామని కాక్రోచ్ పార్టీ ప్రెసిడెంట్ దీప్కే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రధాని మోదీ ఇన్ ఫ్లూయన్సర్‌గా మారాలని మాట్లాడుతున్నారు. వారి వెనుక ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు ఉన్నాయి. ఆ విషయం బహిరంగంగా చెప్పుకోవడం లేదు. బీజేపీకి తెలుసు. కానీ ఇలాంటి వారికి బలం ఇచ్చింది బీజేపీ డిఫెన్సివ్ ధోరణినే. అందుకే భరించక తప్పడం లేదు. దశాబ్దాలుగా ఎలక్షన్ మెషినరీని, పార్లమెంటరీ వ్యూహాలను శాసిస్తున్న బీజేపీ, మోదీ–షా ద్వయం ఈ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు స్వంత శైలిలో కౌంటర్ స్ట్రాటజీని అమలు చేస్తోంది. అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన పెల్లెట్ ప్రయోగం ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్‌లు సభలో తీవ్రంగా నిలదీశారు. రూల్ బుక్ ఆధారంగా స్పీకర్ చేత ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేలా చేయడంలో సఫలమయ్యారు.

# రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...



**హైదరాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ ఆఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

# పక్కా వ్యూహాలతో టీపీసీసీ



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. నాఎఖీ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డిసిసిలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం. పార్టీ యంత్రాంగం-ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

# నల్గొండలో కోమటి వర్గానిదే పై చేయి...



**నల్గొండ,** : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుల మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ పీఠంపై జరుగుతున్న పోరు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బట్టబయలు చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను పదవి నుంచి తొలగించాలనే ప్రతిపాదన తీవ్ర దుమారానికి దారితీసింది. కోమటిరెడ్డి సోదరులు మొదటి నుంచి ఈయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకోల్ వివాదం తలెత్తడం, స్థానిక కేడర్ మధ్య విభజన స్పష్టంగా కనిపించడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకవైపు అధినేత అండదండలు ఉన్నప్పటికీ, సొంత జిల్లా మంత్రుల ఒత్తిడి కారణంగా ఈ మార్పు వ్యవహారం అత్యంత సున్నితమైన రాజకీయ అంశంగా మారింది. ఈ పరిణామం కేవలం ఒక పదవికి సంబంధించినది కాకుండా, పార్టీలో ఎవరి ఆధిపత్యం చెల్లుబాటు అవుతుందనే దానికి నిదర్శనంగా మారింది. ఒకవేళ పున్నాపై వేటు పడితే, అది సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి ఎదురుదెబ్బగా భావించాల్సి వస్తుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టు నెగ్గితే, అది ప్రత్యర్థి శిబిరానికి స్పష్టమైన రాజకీయ సంకేతాలను పంపుతుంది. ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, మంత్రివర్గంలో చక్రం తిప్పుతున్న బలమైన మంత్రుల ఒత్తిడిని అధిగమించడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ అత్యంత కీలకమైనవే కాబట్టి, ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర స్థాయిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమీకరణాలు కావడం గమనార్హం. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు కావడం పార్టీకి ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే కుల గణనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బీసీ నేతను పదవి నుంచి తప్పించడం తీవ్ర విమర్శలకు దారితీసే ప్రమాదం ఉంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే, ప్రతిపక్షాలకు బలమైన అస్త్రం దొరికినట్లే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. సామాజిక న్యాయం నినాదానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు రాకుండా ఉండేందుకు పార్టీ పెద్దలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్గపోరు తీవ్ర రూపం దాల్చడం, బీసీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ హైకమాండ్ తల పట్టుకుంటోంది. ఒకవైపు మంత్రుల పట్టుదల, మరోవైపు ఎన్నికల సమయాన సామాజిక సమీకరణాలు దెబ్బతింటాయనే ఆందోళన పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు పార్టీకి నష్టం చేకూరుస్తాయని అనుభవజ్ఞులైన నేతలు హెచ్చరిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ అసమ్మతి రాగాలు పెరిగితే అది నష్టాన్ని కలిగిస్తుంది. వివాదాలను సద్దుమణిగిస్తూ, అందరినీ కలుపుకెళ్లే వ్యూహరచన చేయడంలో అధిష్టానం విఫలమైతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఈ సంక్షష్ట పరిస్థితిని పార్టీ పెద్దలు ఎలా చక్కదిద్దుతారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో డీసీసీల మార్పు కత్తిమీద సాములా మారింది. ఒకవైపు సొంత పార్టీ మంత్రుల ఒత్తిడి, మరోవైపు సామాజిక వర్గాల అసంతృప్తి మధ్య అధిష్ఠానం సతమతమవుతోంది. ఈ వివాదానికి త్వరలోనే తెరపడకపోతే, అది రాబోయే ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి, ఐక్యతను సాధించడంలో నాయకత్వం సఫలమవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ భవిష్యత్తును శాసించేదిగా ఉండనుంది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు



**హైదరాబాద్,** : తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# రంగనాధ్ కు మద్దతుగా రేవంత్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఈ ఉదంతం ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ అంశంలో అంగుళం కూడా వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా రంగనాథ్‌నే అదే పదవిలో కొనసాగించాలనే దిశగా కాంగ్రెస్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారుల నియామకం, బదిలీలు అనేది సంపూర్ణంగా ప్రభుత్వం పరిధిలోని అంశమని, ఇందులో కోర్టు జోక్యం సరికాదనే బలమైన వాదనను వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించి లీగల్ ఆప్షన్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి రాగానే దీనిపై తుది సమీక్ష నిర్వహించి, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కోర్టు ఆదేశాలపై స్టే తెచ్చుకోవడమే కాకుండా, రంగనాథ్ బాధ్యతలను యథాతథంగా కొనసాగించేలా న్యాయపోరాటం చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. రాజకీయ కోణంలో చూస్తే, హైడ్రా అనేది కేవలం ఒక ప్రభుత్వ విభాగానికో లేదా ఆక్రమణల తొలగింపుకో పరిమితమైన అంశం కాదు. ఇది రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌తో నేరుగా ముడిపడి ఉంది.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అత్యంత ఆవేశంగా, పట్టుదలతో ముందుకు తీసుకెళ్లిన ప్రాజెక్ట్ హైడ్రా. ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల కారణంగా వెనకడుగు వేస్తే, అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధంగా మారుతుంది. అధికారుల నియామకంలో కోర్టుల ఆదేశాలకు తలొగ్గితే, భవిష్యత్తులో పరిపాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రా లక్ష్యాలను నిర్భయంగా అమలు చేయడంలో రంగనాథ్ చూపిన చొరవ రేవంత్‌కు బాగా నచ్చింది. ఆయనను తొలగిస్తే పథకం వేగం మందగిస్తుందనేది సర్కార్ భయం. న్యాయస్థానాలు కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతుంటే, ప్రభుత్వం మాత్రం తమ పరిపాలనాధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు చట్టబద్ధత, కోర్టు ధిక్కరణ ఆరోపణలు, మరోవైపు రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పట్టుదల.. ఈ రెండింటి నడుమ హైడ్రా వ్యవహారం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం వినిపించే వాదనలు ఎంతవరకు నిలబడతాయి? కోర్టు రంగనాథ్ నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రేవంత్ రెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లోనూ, అధికారుల నియామక ప్రక్రియల్లోనూ ఒక కొత్త చర్చకు దారితీయడం ఖాయం

# లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్



**చెన్నై,** : తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతో ఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ప్రతిపక్ష డీఎంకే గనుక స్థానిక పోరులో పైచేయి సాధిస్తే, టీవీకే గెలుపు కేవలం తాత్కాలిక వేవ్ లేదా హైప్ మాత్రమే.. క్షేత్రస్థాయిలో వాళ్లకు ఎలాంటి పునాది లేదు అని విస్తృతంగా ప్రచారం చేసి విజయ్ ప్రభుత్వ ఇమేజ్‌ను మొదటికే మోసం చేసేలా కౌంటర్ ఇచ్చే ప్రమాదం ఉందని అధికార పక్షం భావిస్తోంది. ఈ ముప్పును ముందుగానే గ్రహించిన సీఎం విజయ్, ముందుగా రాబోయే అసెంబ్లీ ఉపఎన్నికలపై దృష్టి సారించి, స్థానిక సంస్థల పోరును ఏడాది పాటు పక్కన పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ లోపు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డులో టీవీకే కమిటీలను పటిష్టం చేసి, కొత్త రక్తాన్ని నింపి, శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిల్లో డీఎంకేను ఢీకొట్టేలా వ్యవస్థను నిర్మించుకున్న తర్వాతే బరిలోకి దిగడం సురక్షితమని, ఆలోపు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల్లో మరింత ఆదరణ పెంచుకోవాలని టీవీకే నాయకత్వం భావిస్తోంది. ఎన్నికలను వాయిదా వేసే యోచన వెనుక భయం కంటే రాజకీయ చాతుర్యమే ఎక్కువగా కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థుల బలమైన ప్రాంతంలో తొందరపడి అడుగుపెట్టి దెబ్బతినడం కంటే, సమయం తీసుకుని సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాకే యుద్ధానికి వెళ్లడం విజయ్ రాజకీయ పరిణతికి నిదర్శనంగా మారింది.

# ఏపీ బీజేపీకి ఏమైంది...



**విశాఖపట్టణం, :** ఏపీలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఆ పార్టీ అనుకున్న స్థాయిలో ముందుకెళ్లడం లేదు. పొత్తులో భాగంగా సీట్లు, ఓట్లు పెరిగాయే తప్ప.. గత రెండు సంవత్సరాలుగా ఆ పార్టీ పుంజుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆ పార్టీలో పెద్దగా చేరికలు లేవు. చేరిన వారు సైలెంట్ గా ఉన్నారు. పాత నేతలు వ్యూహాత్మక సైలెన్స్ పాటిస్తున్నారు. పొత్తులో భాగంగా పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పని తాను చేసుకుంటున్నారు. ఎందుకో పార్టీని అభివృద్ధి చేసే ఆలోచన ఆ పార్టీ నేతల్లో కనిపించడం లేదు. ఏపీ విషయంలో హై కమాండ్ సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు.రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రాష్ట్ర మంత్రి ఉన్నారు. ఒక కేంద్రమంత్రి కొనసాగుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తన ముద్ర చూపలేకపోతోంది ఏపీలో. కనీస స్థాయిలో చురుకైన పార్టీ కార్యక్రమాలు కూడా లేవు. అదే తెలంగాణలో అయితే నిత్యం బిజెపి పెద్దల పర్యటనలు, ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఏపీలో అది సాధ్యం కాదు. ఎందుకంటే బిజెపి ఇక్కడ మిత్రపక్షం. అయితే పార్టీ పరంగా కూడా యాక్టివ్గా కార్యక్రమాలు లేవు. ఇతర పార్టీల నుంచి చేరికలు లేవు. ఫలితంగా ఆ పార్టీ అనుకున్న స్థాయిలో పుంజుకోలేకపోతోంది.పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పివిఎన్ మాధవ్ వ్యవహరిస్తున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్నాక పార్టీ మరింత పుంజుకుంటుందని అంచనా వేశారు. కానీ ఎందుకో అనుకున్న స్థాయిలో ముందుకు వెళ్లలేకపోతోంది. పార్టీ బాధ్యతలు తీసుకున్న కొత్తలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలకు సిద్ధపడ్డారు మాధవ్. తరువాత చురుకుదనం తగ్గింది. కేవలం కూటమితో ముందుకు వెళ్లడమే తప్పించి.. స్వతంత్రంగా ఏపీలో పార్టీ ముందుకెళ్లే పరిస్థితి లేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కనీసం బిజెపి ఉనికి చాటుకుంటుందా? లేదా అన్నది అనుమానమే. తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట కూడా స్థానిక నాయకత్వం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. అయితే భారీగా చేరికలు ఉంటాయని అప్పట్లో అంచనాలు ఉండేవి. కానీ ఎందుకో ఇప్పటికే చేరిన వారు యాక్టివ్ గా లేరు. అందుకే కొత్తగా ఎవరూ ముందుకు రావడం లేదు. మరి ఏపీ విషయంలో బిజెపి ఆలోచన ఏంటో ఇంతవరకు తెలియడం లేదు. ఇలా అయితే ఆ పార్టీకి కష్టమే

# బుట్టాయగూడెం- పట్టిసీమ- కొవ్వూరు

# రూ.705 కోట్లతో రెండు లైన్లుగా విస్తరణ

**ఏలూరు, :** ఏపీలో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న జాతీయ రహదారి విస్తకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని నేషనల్ హైవే 365బీబీలో 44.70 కిలోమీటర్లు రెండు లైన్లుగా విస్తరించేందుకు మోర్త్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. రూ.705 కోట్లతో నిర్మించే ఈ హైవేలో రెండుచోట్లు బైపాస్‌లు కూడా ప్లాన్ చేస్తున్నారు. గతవారం మోర్త్ నుంచి హైవే విస్తరణకు లైన్ క్లియర్ అయ్యింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల విస్తరణపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా అసవరమైన చోట్ల రొడ్ల విస్తరణకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించగా.. ఒక్కో ప్రాజెక్టుకు లైన్ క్లియ్ అవుతోంది. తాజాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం–పట్టిసీమ– కొవ్వూరు హైవే విస్తరణకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.. మొత్తం 44.70 కిలోమీటర్ల రోడ్డును విస్తరించనున్నారు. ఈ హైవేను రూ.705 కోట్లతో పది మీటర్ల వెడల్పు, రెండు వరుసలుగా విస్తరణను మోర్త్ (కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ) స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ ఆమోదించింది.నేషనల్ హైవే 365బీబీ తెలుగు రాష్ట్రాల మధ్య ఉంది.. ఈ రోడ్డు సూర్యాపేట నుంచి మొదలై ఖమ్మం, వైరా మీదుగా.. ఏపీలోని జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పట్టిసీమ మీదుగా కొవ్వూరు వరకు ఉంది. బుట్టాయగూడెం–పట్టిసీమ–కొవ్వూరు రోడ్డు 44.70 కిలోమీటర్లు విస్తరించలేదు. ఈ రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన ఎన్‌హెచ్ అధికారులు విస్తరించేందుకు మోర్త్‌కు ప్రతిపాదనలు పంపించారు.. కానీ కొన్ని కారణాలతో అనుమతులు ఆలస్యం అయ్యాయి. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ఈ రోడ్డు విస్తరణ అంశాన్ని



కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా.. మోర్త్ స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీ సమావేశంలో ఆమోదం వచ్చింది.ప్రస్తుతం విస్తరించబోతున్న హైవేలో ఉన్న పట్టిసీమకు పోలవరం ప్రాజెక్ట్ 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. పోలవరం పూర్తిచేస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.. అప్పుడు పట్టి సీమ మీదుగా వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించి పట్టిసీమ దగ్గర బైపాస్ నాలుగు వరుసలతో (3.20 కిమీ) కూడా రాబోతుండగా.. ఈ బైపాస్ కోసం డీపీఆర్ త్వరలో సిద్ధం చేయనున్నారు. కన్నాపురం దగ్గర మరో బైపాస్ ప్లాన్ చేయగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇటు పశ్చిమగోదావరి జిల్లాలో మరో హైవేను నాలుగు వరుసలుగా విస్తరించున్నారు. రూ.2,700 కోట్లతో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించనున్నారు. డీపీఆర్‌లో ఆకివీడు, ఉండి, భీమవరం దగ్గర బైపాస్‌లు ప్లాన్ చేశారు.

# కాపు ఓట్ల కోసం రేసు



**విజయవాడ, :** ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఓట్ల కోసం ఇప్పుడు రేసు ప్రారంభమయింది. అన్ని పార్టీలు కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు పోటీ పడుతున్నాయి. కాపు సమావేశాల పేరిట ఆ సామాజికవర్గానికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నాయి. వైసీపీ, టీడీపీ ఈ రకమైన ప్రయత్నాలు మొదలు పెట్టాయి. కాపులు తమ వెంటే ఉంటారని జనసేన మాత్రం కొంత వెనకబడి ఉన్నా పవన్ వెనకే ఉంటారన్న ధీమాలో ఉంది. ఇక బీజేపీ కూడా ఏ మాత్రం తగ్గడం లేదు. తరచూ సమావేశాలు పెట్టడంతో పాటు కాపు రిజర్వేషన్ల ఉద్యమాన్ని మరొకసారి తెరపైకి తెచ్చేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు సామాజికవర్గానికి అన్యాయం చేస్తుందని వైసీపీ ఆరోపిస్తుంది. కాపు కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేయకపోగా వారికి పదవుల విషయంలోనూ ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెబుతోంది. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బలంగా ఉన్న కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును తమ వైపునకు రప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే తోట త్రిమూర్తులు అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వెంకటాపురంలో వైసీపీ కాపు నేతలతో సమావేశమై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవ్వాలని నిర్ణయించారు. వైసీపీ తర్వాత అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి కాపు నేతలతో పాటు ప్రజలను కూడా ఏకతాటిపైకి తేవాలని ప్రయత్నిస్తున్నాయి. త్వరలోనే మరొక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు వైసీపీ సిద్ధమవుతుంది... టీడీపీ కూడా కాపు సామాజికవర్గంలో బలం మరింత పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. కాపు సామాజికవర్గం టీడీపీ నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. అంతేకాకుండా ప్రభుత్వంపై కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. దీనికి బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన కోస్తా జిల్లా నేత కావడంతో త్వరలోనే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలను ఏకం చేయాలని ప్రయత్నంలో ఉన్నారు. మరొకవైపు టీడీపీ కాపులకు ఇస్తున్న ప్రాధాన్యత మరే ప్రభుత్వంలో ఇవ్వడం లేదని ప్రచారం చేయాలని కూడా నిర్ణయించారు. అధినాయకత్వం ఆశీస్సులతోనే ఈ కార్యక్రమానికి టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. మొత్తం మీద ఈ రేసులో ఎవరిది పై చేయి అవుతుందన్నది రానున్న కాలమే చెబుతుంది.

పదవుల కోసం తపన

తెలుగుదేశం పార్టీలో కాపు నేతలు పదవుల కోసం పరితపిస్తున్నారు. ముఖ్యంగా తమకు మంత్రి పదవి దక్కలేదన్న భావన చాలా మందిలో ఉంది. జనసేన కారణంగానే తమకు మంత్రి పదవులు దక్కలేదన్న భావనలో వారిలో గట్టిగా ఉన్నట్లుంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తరచూ చేస్తున్న వ్యాఖ్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. అందుకే వీలు దొరికినప్పుడల్లా టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అదే అర్థం వచ్చేలా చెబుతున్నాయి. జనసేనతో పొత్తు తర్వాత తమకు ప్రాధాన్యత తగ్గిందన్న భావన కనిపిస్తుంది. తమ పార్టీకి చెందిన నాయకత్వాన్నే ఆయన ప్రశ్నిస్తున్నారు. పదే పదే బొండా ఉమామహేశ్వరరావు చేస్తున్న కామెంట్స్ పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ బొండా ఉమామహేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మంత్రి పదవులు దక్కలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు మాత్రం మంత్రి పదవులు వచ్చాయన్నారు. కొలుసు పార్థసారథి, సవిత, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ లకు మంత్రి పదవులు దక్కడాన్ని ప్రశ్నించారు. తాము మాచర్లలోనూ అనేక ఘటనలోనూ పార్టీకోసం ఇబ్బందులు పడినా మంత్రి పదవులు రాలేదన్నారు. కానీ పార్టీని నమ్ముకుని మాత్రమే పనిచేస్తామని చెప్పిన బొండా ఉమామహేశ్వరరావు తాజాగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి కలకలం రేపాయి.ముద్రగడ పద్మనాభం సంతాప సభలో టీడీపీ ఎమ్మెల్యే బాండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ముద్రగడ చేసిన పోరాటం వల్లే 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవాల్సి వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ముద్రగడ సంతాప సభలో బొండా ఉమ వ్యాఖ్యలుముద్రగడ పద్మనాభం మరణం కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన కొనియాడారు.కాపు జాతి హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం ముద్రగడ జీవితాంతం నిర్విరామంగా పోరాడారని గుర్తుచేశారు.ఆయన ఆశయాలను సాధించడమే ముద్రగడకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.2019 ఎన్నికల సమయంలో ముద్రగడ చేపట్టిన ఉద్యమ ప్రభావం రాజకీయంగా తమ పార్టీపై గట్టిగా పడిందని, అందుకే టీడీపీ అధికారం కోల్పోయిందని ఓపెన్‌గా వ్యాఖ్యానించారు. అంతేకాదు.. పార్టీ నాయకత్వాన్ని కొందరు తప్పుదోవపట్టించి, ముద్రగడపై వ్యతిరేకత పెంచారని, అదే ఓటమికి కారణమయిందని అన్నారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని బొండా ఉమామహేశ్వరరావు చెప్పడం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ నేతలతో కలసి కార్యక్రమంలో పాల్గొన్నందుకు బొండా ఉమామహేశ్వరరావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నోటీసులు ఇవ్వాలని, వివరణ కోరాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు.

# పిఠాపురంలో పవన్ మార్క్...




**కాకినాడ, :** పిఠాపురం అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఈ నియోజకవర్గాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల అవసరాలు ప్రాధాన్యతలను గుర్తించి వివిధ శాఖల అధికారులతో ఆయన తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వేగంగా చేరేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. అధికారులను నిరంతరం పరుగులు పెట్టిస్తూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్నారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.తాజాగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో వైద్య రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పీఠాపురంలో ప్రధాన ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేయాలని దేవాదాయ శాఖను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వంద భజన మందిరాల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. స్థల సేకరణ ఆలయ కమిటీల ఏర్పాటులో వచ్చే సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ కోరారు. ఎల్నినో ప్రభావం వల్ల నీటి లభ్యత ఆధారంగా రైతులకు ముందుగానే నీటి విడుదల క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. సాగునీరు సక్రమంగా అందకపోతే రైతులు నష్టపోతారని ముందస్తు జాగ్రత్తలు అవసరమని స్పష్టం చేశారు. మరోవైపు నియోజకవర్గంలో జరుగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాల నాణ్యతపై తీవ్రంగా స్పందించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే రెండొందల ఎనుబది ఎనిమిది సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. అయితే ఆ రోడ్ల నాణ్యతను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకం విస్తరణ పనుల తీరుతెన్నులను కూడా ఆయన నిశితంగా పరిశీలించారు. ప్రతి గ్రామానికి శుద్ధి చేసిన తాగునీరు నిరంతరం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధితో పాటు పనుల్లో పారదర్శకత నాణ్యత చాలా ముఖ్యమని పవన్ కళ్యాణ్ పదేపదే అధికారులకు గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వ ధనం వృథా కాకుండా ప్రతి రూపాయి ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. రాబోయే కాలంలో పీఠాపురం నియోజకవర్గం దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.త్వరలోనే పవన్ కళ్యాణ్ స్వయంగా పీఠాపురంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. ఆ పర్యటనలో భాగంగా మరికొన్ని కొత్త అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఆయన పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. నాయకుడిలో ఉండాల్సిన పట్టుదల నిబద్ధత పవన్ లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారులతో నిరంతరం సమీక్షలు జరుపుతూ పనులను వేగవంతం చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పీఠాపురం ప్రగతి ప్రయాణం ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి

# ఉండవల్లికి కీలక బాధ్యతలు..

**రాజమండ్రి, :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎప్పుడూ ఒక ఆసక్తికర చర్చగా మారుతూ వస్తుంది. ఒకప్పుడు రాష్ట్రాన్ని ఏలిన ఈ పార్టీ విభజన తర్వాత వరుసగా జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. చాలా ప్రాంతాల్లో డిపాజిట్లు కోల్పోయి కేవలం రెండు శాతం ఓటు బ్యాంకుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి చాలా మంది సీనియర్ నేతలు వెనకడుగు వేస్తూ వచ్చారు. విభజన అనంతరం రఘువీరా రెడ్డి, సాకే శైలజానాథ్, ఆ తర్వాత గోదావరి జిల్లాకు చెందిన నేతతో పాటు ప్రస్తుతం వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే రానున్న రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన జరగనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే హైకమాండ్ ఏపీ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పార్టీకి కొత్త జవసత్వాలు అందించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈసారి సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ తూకాలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఏపీలో అత్యంత బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేతకు పీసీసీ పీఠం దక్కే అవకాశం ఉందని సమాచారం. 2029 ఎన్నికల లక్ష్యంగా ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే నాయకత్వ మార్పుతో పాటు కమిటీల ప్రక్షాళన చేపట్టాలని నిర్ణయించారు.గతంలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని హైకమాండ్ కోరిన ఒక సీనియర్ పెద్దాయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కేంద్రంలో కీలక మంత్రి పదవులు నిర్వహించిన ఆ గోదావరి జిల్లా నేతకు బాధ్యతలు ఇస్తే పార్టీ పుంజుకుంటుందని భావించారు. అయితే జాతీయ స్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాలు, దక్షిణాదిన కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఆ పెద్దాయన ఆలోచనలో మార్పు వచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇమేజ్, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆ నేతలు లెక్కలు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో నెలకొన్న శూన్యతను భర్తీ చేయడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నారు.ఈ రేసులో ఉత్తరాంధ్ర నుంచి ఒక కేంద్ర మాజీ మంత్రి పాటు రాయలసీమ ప్రాంతం నుంచి పలువురు సీనియర్ నాయకులు తీవ్ర ఆసక్తి కనబరుస్తున్నారు. గడచిన ఎన్నికల ఫలితాలతో పోలిస్తే 2029 ఎన్నికల వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు నమ్ముతున్నాయి. వైఎస్ షర్మిల నాయకత్వంలో జరిగిన ప్రయత్నాలు ఒక బేస్‌ను ఏర్పాటు చేశాయని, ఇప్పుడు దానిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలపై నమ్మకం ఉన్న ప్రజలు ఇంకా ఉన్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటే పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# 40 రోజుల్లో లోకల్ బాడీ ఎన్నికలు



**ఒంగోలు, :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో.. స్థానిక సంస్థల ఎన్నికలను సైతం పూర్తి చేసి మిగతా రెండున్నర సంవత్సరాల పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది కూటమి ప్రభుత్వం. కేవలం 40 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని లక్ష్యంతో ఉంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు, అదే సమయంలో ప్రాదేశిక ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. చివరిగా పంచాయతీ ఎన్నికలను పూర్తిచేసి స్థానిక సంస్థల కు పాలకవర్గాలను తేవాలని భావిస్తోంది. విజయదశమి నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉంది కూటమి ప్రభుత్వం. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితేనే ఆర్థిక సంఘం నిధుల విడుదలకు అవకాశం ఉంటుంది. కేంద్రం విడుదల చేసే నిధులకు మోక్షం కలుగుతుంది. అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది.రాష్ట్రవ్యాప్తంగా ఏడు కార్పొరేషన్లతో పాటు 108 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పాలకవర్గం గడువు మార్చి తోనే ముగిసింది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తొంది ప్రభుత్వం. దానికి కారణం లేకపోలేదు. పట్టణాల్లో కూటమి ప్రభుత్వం పట్ల సానుకూలత ఉంది. పైగా మిగతా మిత్రపక్షాలతో పోల్చుకుంటే టిడిపికి బలం ఎక్కువ. అందుకే పొత్తులో భాగంగా మున్సిపాలిటీలను జనసేనకు కేటాయించి.. మెజారిటీ మున్సిపాలిటీలను మాత్రం టిడిపి తీసుకోవాలని చూస్తోంది. బిజెపికి సైతం కొంత భాగస్వామ్యం ఇచ్చే ఛాన్స్ ఉంది. అయితే సెప్టెంబర్ మొదటి వారంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అక్కడకు పక్షం రోజుల వ్యవధిలోనే జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని భావిస్తోంది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్తులు కాకుండా.. 26 జిల్లాలకు సంబంధించి జిల్లా పరిషత్తు ఎన్నికలు జరగనున్నాయి.చివరిగా పంచాయతీ ఎన్నికలను అక్టోబర్ మొదటి వారంలోనే మూడు విడతల్లో పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. అంటే విజయదశమి లోపు దాదాపు అన్ని స్థానిక సంస్థలకు పాలకవర్గాలు తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలతో పాటు ప్రాదేశిక ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తాయి. ఆ ప్రభావం పంచాయితీ ఎన్నికలపై కూడా పడుతుంది. ఈ మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 శాతం సీట్లను సంపాదించవచ్చు అనేది ప్రభుత్వ ఆలోచన. గతం మాదిరిగా కాకుండా.. ఏకగ్రీవాలను తగ్గించి.. పోటీ వైపే మొగ్గు చూపించి వైసిపికి మరోసారి షాక్ తినిపించాలని చూస్తోంది కూటమి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పక్కా వ్యూహం అమలు చేయనుంది. చూడాలి ప్రభుత్వ ప్రయత్నం, ఆలోచన ఎంతవరకు ఫలిస్తుందో..

# వారం రోజులపాటు టెలిగ్రామ్ యాప్‌పై నిషేధం




**న్యూఢిల్లీ :** ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను వారం రోజులపాటు కేంద్రప్రభుత్వం నిషేధించింది. దేశంలో నుంచి ఈ నెల 22 వరకూ నిషేధం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విజ్ఞప్తితో ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ (యుజి) 2026 పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరీక్షను ఈ నెల 22న మరోసారి నిర్వహించనున్నారు. ఈ పునఃపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను మోసం చేయడానికి టెలిగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ను మోసపూరిత ముఠాలు ఉపయోగించుకుంటున్నాయని ఎన్‌టిఎ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అనేక టెలిగ్రామ్ గ్రూపుల్లో నకిలీ పరీక్ష పత్రాల గురించి ప్రచారం చేస్తూ, వాటి కోసం డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను మోసం చేస్తున్నాయని ఎన్‌టిఎ తెలిపింది. ఈ యాప్‌ను నిషేధిస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇంతటి భారీ స్థాయిలో పనిచేస్తున్న ఒక మెసేజింగ్ యాప్‌ను ఒక పరిమిత కాలానికైనా సరే, భారత్‌లో నిషేధించడం ఇదే మొదటిసారి. ఈ నెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను భారత్‌లో డిసేబుల్ చేయాలని టెలిగ్రామ్‌ను కేంద్రం ఆదేశించింది.

టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ గతంలో పోస్ట్ చేసిన మెసేజ్‌లను సవరించడంతోపాటు, పేపర్ లీక్ సాక్ష్యాలను తారుమారు చేసేందుకు నిందితులు ఈ ఫీచర్‌ను దుర్వినియోగపరుస్తున్నట్లు కేంద్రానికి ఎన్‌టిఎ ఫిర్యాదు చేసింది. తమకు ప్రశ్నాపత్రం యాక్సెస్ ఉందని మోసపూరిత ప్రచారం చేస్తోన్న అనేక ఛానళ్లు, గ్రూప్‌లు, బాట్‌లను అధికారులు ఇంతకు ముందే తొలగించారు. తాజా నిర్ణయంతో చట్టబద్ధమైన యూజర్లకు అసౌకర్యం ఏర్పడుతుందనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో అత్యంత కీలమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ సమగ్రతను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకున్నామని కేంద్రం పేర్కొంది.



# అప్పుడు గుహలు.. ఇప్పుడు బంకర్లు: ఉగ్రవాదుల కొత్త పన్నాగాలు..!

భద్రతా బలగాలకు చిక్కకుండా ఉగ్రవాదులు కొత్తకొత్త పన్నాగాలు పన్నుతున్నారు. ఉగ్రదాడులకు ముందు వారు దాక్కొనేందుకు గుహలకు బదులుగా బంకర్లను వాడుతున్నారు. జమ్మూకశ్మీర్ రాజౌరీలో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు విస్తుపోయే విషయాలను గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఉగ్రవాదులు తాము నక్కే ప్రదేశాల విషయంలో మార్పులు చేసుకుంటున్నారు. తమ హైడవుట్స్‌గా గతంలో గుహలను ఉపయోగించుకున్న ఆ మూకలు.. అండర్‌గ్రౌండ్ బంకర్లను వాడుతున్నారు. గతేడాది కశ్మీర్ లోయలోని కుల్గామ్ అడవుల్లో నిర్వహించిన సెర్చ్ అండ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు ఈ విషయాన్ని గుర్తించాయి. అవన్నీ తాత్కాలిక నిర్మాణాలు. భూమిని తవ్వి, దుంగలతో వాటిని నిర్మించుకున్నారు. చత్రు ప్రాంతంలో 12 వేల అడుగుల ఎత్తులో ఈ ఏడాది ప్రారంభంలో కూడా అలాంటి బంకర్ ఒకటి భద్రతా సిబ్బంది కంటపడింది. ఒకేసారి నలుగురు ఉండేంత విశాలంగా అది ఉంది. కొన్ని నెలల పాటు సరిపడా త్యావసరాలను అందులో నిల్వ చేసుకున్నట్లు బలగాలు వెల్లడించాయి. జోజి లా సొరంగ మార్గం పనులు పూర్తి ఉగ్రవాదులు గుహలు తాత్కాలిక బంకర్లకే పరిమితం కాకుండా దట్టమైన అడవుల్లో ఎక్కువ కాలం మన్నిక ఉండే పక్కా బంకర్ల నిర్మిస్తున్నారని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఎక్కువకాలం అజ్ఞాతంలో ఉండేందుకు వీలుగా, ఆశ్రయం కోసం స్థానికుల మీద ఆధారపడకుండా ఉండేలా అవి ఉపయోగపడనున్నాయి. ఉగ్రవాదులు నక్కారనే ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా మే 22 నుంచి సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఆపరేషన్ షెరువాలీ పేరిట రాజౌరీలోని అటవీ ప్రాంతంలో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రమూకలకు, బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు దట్టమైన అడవిలోకి పారిపోయారు. రాజౌరీలోని గంబీర్ ముగ్లన్, డొరిమల్ ప్రాంతంలో ఉన్న హైడవుట్‌లో ఆశ్రయం పొందుతూ ఉండొచ్చని భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులుతాము నక్కే ప్రదేశాల విషయంలో మార్పులు చేసుకుంటు న్నారు. తమ హైడవుట్స్‌గా గతంలో గుహలను ఉపయోగించుకున్న ఆ మూకలు.. అండర్‌గ్రౌండ్ బంకర్లను వాడుతున్నారు. గతేడాది కశ్మీర్ లోయలోని కుల్గామ్ అడవుల్లో నిర్వహించిన సెర్చ్ అండ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు ఈ విషయాన్ని గుర్తించాయి. అవన్నీ తాత్కాలిక నిర్మాణాలు. భూమిని తవ్వి, దుంగలతో వాటిని నిర్మించుకున్నారు. చత్రు ప్రాంతంలో 12 వేల అడుగుల ఎత్తులో ఈ ఏడాది ప్రారంభంలో కూడా అలాంటి బంకర్ ఒకటి భద్రతా సిబ్బంది కంటపడింది. ఒకేసారి నలుగురు ఉండేంత విశాలంగా అది ఉంది.

# ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టం



మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఆ దేశంలో పెట్టుబడులు పెట్టాల్సిన బాధ్యత తమకేమీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ–7 సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ఇరాన్‌లో తాము పెట్టుబడులు పెట్టబోమని స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సముపార్జించుకోకుండా చూడడమే ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశమని అంటూ ఒకవేళ అదే జరిగితే ఆ దేశానికి పెను విపత్తు తప్పదని హెచ్చరించారు. ఇరాన్‌తో ఒప్పందం రెండో దశకు చేరుకుంటోందని ఆయన అన్నారు. 'ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. అది విజయవంతం అవ్వాలి. అప్పుడు రెండో దశకు వెళుతుంది. అది తేలికగానే జరుగుతుందని నేను అనుకుంటున్నాను' అని జీ–7 సదస్సు సందర్భంగా విలేకరులతో అన్నారు. కాగా ఒప్పందంపై సంతకాలు జరిగే కార్యక్రమం స్విట్జర్లాండ్‌లో జరుగుతుందని, దీనికి తమ దేశం తరఫున చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ హాజరవుతారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తక్త్–రవంచి అంతకుముందు తెలిపారు. ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోనే సంతకాలు జరుగుతాయని, అయితే ఏ ప్రదేశంలో జరిగేదీ ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. సంతకాల ప్రక్రియ పూర్తయిన వెంటనే తదుపరి విడత చర్చలు మొదలవుతాయని అన్నారు. అమెరికా తరఫున చర్చలలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాల్గంటారని తెలిపారు. యుద్ధం ముగియడం అంటే లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆక్రమణ కూడా ముగిసినట్లేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు.

# వైసీపీ నేతలతో డయాస్ షేరింగ్ వద్దు

విజయవాడ, : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు వ్యవహారంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వేదిక పంచుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బొండా ఉమ నుంచి తక్షణమే సంజాయిషీ తీసుకోవాలని చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన నుంచి వివరణ స్వీకరించే బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల గుంటూరులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి బొండా ఉమ, అంబటి రాంబాబు హాజరయ్యారు. ఇద్దరూ ఒకే వేదికపై ఆశీనులవడమే కాకుండా, ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. నిత్యం చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే అంబటితో బొండా ఉమ వేదిక పంచుకోవడంపై సొంత పార్టీ శ్రేణుల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. ఈ పరిణామంపై పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు తీవ్ర స్వరంతో స్పందించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని, 'విషవృక్షం' అని అభివర్ణించిన ఆయన, ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. "కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి,



ప్రజలను విడదీయడమే వైసీపీ ఎజెండా. ఆ పార్టీ పన్నే ఉచ్చులో ఎవరూ పడొద్దు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ వైసీపీ నేతలతో మన పార్టీ నాయకులు వేదిక పంచుకోకూడదు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. గతంలోనూ కొందరు నేతలు వైసీపీ నేతలతో కనిపించడం పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే బొండా ఉమ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. తాజా నిర్ణయంతో, ఈ తరహా విషయాల్లో ఉపేక్షించేది లేదని చంద్రబాబు పార్టీ శ్రేణులకు స్పష్టమైన సందేశం పంపినట్లయింది.

# ఆదివాసీల సంస్కృతికి నిలువుటద్దం నాగోబా జాతర

తెలంగాణ సంస్కృతి అంటే రాజప్రాసాదాలు, శిల్పకళ వైభవం మాత్రమే కాదు. అడవి తల్లి ఒడిలో, కొండగుట్టల నడుమ ప్రకృతితో మమేకమైన జీవన విధానమే అసలైన తెలంగాణ తత్వం. ఆ జీవన తత్వానికి అద్దం పట్టే మహోత్సవమే నాగోబా జాతర. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక కాదు. ప్రకృతి పూజగా, సామూహిక ఐక్యతకు ప్రతీకగా, తరతరాలుగా నిలిచిన సంప్రదాయ గౌరవంతో గిరిజన జీవన సంస్కృతిని ప్రతిబింబించే మహోత్సవంగా నాగోబా జాతర తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తుంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నాగోబా జాతర గిరిజన సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు.. ఆత్మగౌరవానికి ప్రతీక. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద జరిగే ఈ జాతరలో గోండులు, కొలాములు, నాయక్పోడ్లు, ప్రాధాన్లు సహా అనేక ఆదివాసీ తెగలు తమ సంప్రదాయాలను ఆచరిస్తారు. నాగోబా దేవతను సర్పరూప దైవంగా భావిస్తూ, ప్రకృతిని తల్లి రూపంలో పూజించే గిరిజన విశ్వాసం ఈ జాతరలో స్పష్టంగా దర్శనమిస్తుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు, గిరిజనులు, పరిశోధకులు, పర్యాటకులు ఈ జాతరకు తరలివస్తారు. ఇది ఒక జాతరగా మొదలై, కాలక్రమంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవంగా ఎదిగింది. అయితే ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ జాతర గతంలో మౌలిక సదుపాయాల కొరతతోనే కొనసాగింది. రహదారుల లేమి, వైద్య సౌకర్యాల లోపం, తాగునీటి సమస్యలు, భద్రతా ఏర్పాట్ల అసమర్థత భక్తులకు ఇబ్బందులు కలిగించాయి. ఈ పరిస్థితిని మార్చాలన్న స్పష్టమైన సంకల్పంతో ఈసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నాగోబా జాతరకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల విశ్వాసాన్ని పాలనా బాధ్యతగా భావిస్తూ, జాతరను రాష్ట్ర ప్రతిష్ఠకు ప్రతీకగా నిలపాలన్న దృక్పథంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలను రూపొందించి, భక్తుల సౌకర్యం కేంద్రంగా ఏర్పాట్లను చేపట్టింది. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రహదారుల నిర్మాణం, విస్తృత పార్కింగ్ సదుపాయాలు, బస్సు రూట్ల పునర్వ్యవస్థీకరణ, ప్రత్యేక షటిల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వెయ్యికిపైగా బస్సులతో షటిల్ సేవలు అందిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నాగోబా జాతరలో ఆరోగ్య సేవలు అత్యంత కీలకం. అందుకే ప్రభుత్వం 24 గంటల వైద్య శిబిరాలు, మొబైల్ హాస్పిటల్స్, 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 500 మెడికల్ టీంలు, 50 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధమయ్యింది. తాగునీటి కోసం 1000 (వెయ్యి)కి పైగా ట్యాంకర్లు, వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయడంతోపాటు పరిశుభ్రత కోసం 1,000 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించింది. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా ఈ చర్యలు పాలనలో మారుతున్న దృక్పథానికి సంకేతంగా చూడాలి. భద్రతా ఏర్పాట్లలోనూ ప్రభుత్వం రాజీపడలేదు. 5 వేల మంది పోలీసులు, 2 వేల హోంగార్డులు, మహిళా పోలీస్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నాయి.

# రెండో విడత చర్చలకు సిద్ధం వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్చలకు ఇరాన్ తిరస్కరణ



పాకిస్తాన్‌కు వెళ్లనున్న యూఎస్ ప్రతినిధులు
అమెరికాకు ఇజ్రాయిల్ గొప్ప మిత్రదేశం : ట్రంప్
చాలా దూరంలో తుది ఒప్పందం : ఇరాన్
బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం : హౌతీలు

న్యూయార్క్ / టెహ్రాన్ : పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిపే చర్చల కోసం అమెరికా ప్రతినిధులు సోమవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారని ట్రంప్ ప్రకటించారు. ఆదివారం సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్‌లో..
ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధులతో జరగనున్న రెండో విడత ముఖాముఖి చర్చలకు అమెరికా ఏ అధికారులను పంపుతుందో ట్రంప్ వివరంగా చెప్పలేదు. గత వారాంతంలో జరిగిన చర్చలలో అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించారు. కానీ ఆ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. బుధవారం ముగియనున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని, శనివారం హోర్ముజ్ జలసంధిలో కాల్పులు జరపడం ద్వారా ఇరాన్ ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించా రు. అమెరికా అందిస్తున్న ఒప్పందంలోని నిబంధనలను అంగీకరించకపోతే ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. "మేం చాలా సరసమైన, సహేతుకమైన ఒప్పందాన్ని అందిస్తు న్నాం. వారు దానిని అంగీకరిస్తారని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే, వారు అంగీకరించకపో తే, యూఎస్..ఇరాన్‌లోని ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటును, ప్రతి ఒక్క వంతెననూ నాశనం చేయబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో రాశారు.

# ఆ సంకేతం ఇరాన్ ట్రాప్ అనుకొన్నాం: ట్రంప్



ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్–15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడే ఆపరేషన్ సమయంలో కొంతసేపు టెన్షన్ నెలకొన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆ ఫైటర్ జెట్ నుంచి ఎజెక్ట్ అయిన రెండో పైలట్ ఇరాన్ దళాల నుంచి తప్పించుకొని.. పర్వతాల్లో దాక్కొన్నాడని.. తొలుత అమెరికా నిఘా విభాగం అతడి లొకేషన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. కానీ, అతడి వద్ద నుంచి వచ్చిన సందేశం తమను గందరగోళంలో పడేసిందని ట్రంప్ తెలిపారు. రేడియో సిగ్నల్స్‌లో 'భగవంతుడిదే శక్తి' అన్నట్లు వినిపించిందని.. అది ముస్లింలు మాట్లాడినట్లు అనిపించిందన్నారు. ఆ తర్వాత ఆ సిగ్నల్‌ను 'గాడ్ ఈజ్ గుడ్'గా మిలిటరీ అధికారులు వెల్లడించారు. దీంతో అతడు ఇరాన్ దళాలకు దొరికిపోయి ఉంటాడని అనుమానించారు. వారే తప్పుడు సిగ్నల్స్‌ను ట్రాన్స్‌మిట్ చేస్తున్నట్లు భావించారు. కానీ, ఆ తర్వాత సదరు పైలట్ సజీవంగానే ఉన్నాడని గుర్తించారు. వాస్తవానికి యుద్ధం, విపత్కర పరిస్థితుల్లో దళాల సభ్యులు చిక్కుకొన్నవేళ వెంటనే ముందుగా అనుకొన్న కోడ్‌ను మర్చిపోయి.. సహజసిద్ధ శైలిలో స్పందిస్తుంటారు. ఈ పైలట్ విషయంలో కూడా అలానే జరిగింది. దీంతో కొంతసేపు టెన్షన్ నెలకొన్నా.. ఆ తర్వాత వచ్చిన కోడ్ సరైనదేనని నిర్ణయించుకొని ఆపరేషన్ చేపట్టారు.

# జలుబు ఉన్నప్పుడు మజ్జిగ తాగితే...


సాధారణంగా ఇంట్లో ఎవరికైనా జలుబు లేదా దగ్గు వచ్చిందంటే, వెంటనే డైనింగ్ టేబుల్ నుండి పెరుగు, మజ్జిగ మాయమైపోతాయి. ఇవి తీసుకుంటే జలుబు ఇంకా ఎక్కువవుతుందని చాలా మంది నమ్ముతుంటారు.

అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందో శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. మజ్జిగలోని వే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషణను అందిస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. పులియబెట్టిన పాల ఉత్పత్తులు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. వైద్యపరంగా చూస్తే.. జలుబు, దగ్గులు ప్రధానంగా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తాయి. ఆహారం నేరుగా ఈ వ్యాధులను తీవ్రతరం చేస్తుందనడానికి ఎటువంటి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి వివరణ ప్రకారం.. మజ్జిగను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు, పైగా అది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మజ్జిగ తాగాలనుకునే వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నేరుగా ఫ్రిజ్ నుండి తీసిన చల్లని మజ్జిగ తాగడం వల్ల గొంతు చికాకుకు గురై దగ్గు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న మజ్జిగనే వాడాలి. మజ్జిగలో అల్లం, మిరియాలు, జీలకర్ర వంటివి కలపడం వల్ల అది జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా, శరీరానికి హాయినిస్తుంది.

అయితే రాత్రి సమయాల్లో కంటే, మధ్యాహ్న భోజన సమయంలో మజ్జిగ తీసుకోవడం ఉత్తమం. అయితే అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. మీకు తీవ్రమైన గొంతు నొప్పి, టాన్సిల్స్ వాపు లేదా జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు కొన్ని రోజుల పాటు మజ్జిగకు దూరంగా ఉండటమే మంచిది. అలాగే, మజ్జిగ తాగిన వెంటనే లక్షణాలు పెరుగుతున్నట్లు అనిపిస్తే మీ వ్యక్తిగత సున్నితత్వాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి. జలుబు లేదా దగ్గు ఎక్కువ కాలం తగ్గకుండా వేధిస్తుంటే, అది ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. అటువంటప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం అవసరం.



## మోకాళ్ల నొప్పులకు చెక్ పెట్టాలా?



వెనక్కి నడవడం అనేది వినడానికి వింతగా అనిపించినా, ఇది శరీరానికి, మెదడుకి ఒక సరికొత్త సవాలును విసురుతుంది. మనం రోజూ చేసే పనుల కంటే భిన్నంగా చేయడం లేదా కనీసం ప్రయత్నించడం వల్ల మెదడు మరియు నాడీ వ్యవస్థ వేగంగా స్పందిస్తాయి. ప్రతిరోజూ ఉదయం నిద్రలేవగానే మనం చేసే పనులు మన రోజంతా ఎలా గడవబోతుందో నిర్ణయిస్తాయి. సాధారణంగా అందరూ ముందుకు నడవడానికి అలవాటు పడతారు. కానీ, కేవలం 30 సెకన్ల పాటు వెనక్కి నడిస్తే మీ మెదడు, శరీరంపై అద్భుతమైన సానుకూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

దీనిని 'రెట్రో వాకింగ్' అని కూడా పిలుస్తారు. బ్యాలెన్స్, స్టెబిలిటీ : వెనక్కి నడవడానికి ఎక్కువ ఏకాగ్రత, నియంత్రణ అవసరం. ఇది శరీరాన్ని సమతుల్యం చేసే సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్యంగా వృద్ధులలో పడిపోయే ప్రమాదాలను తగ్గిస్తుంది.కొత్త కండరాల ఉత్తేజం : ముందుకు నడిచేటప్పుడు పెద్దగా పని చేయని కండరాలు వెనక్కి నడిచేటప్పుడు యాక్టివ్ అవుతాయి. దీనివల్ల లోయర్ బాడీ స్ట్రెంగ్త్ పెరుగుతుంది.మోకాళ్ల నొప్పుల నివారణ : ఫిజియోథెరపీలో దీనిని ఒక చికిత్సగా వాడతారు.

## నిద్రపోయే ముందు పసుపు పాలు తాగితే బాడీలో ఏం జరుగుతుందో తెలుసా?

పసుపు పాలు.. మన ఇంట్లో ఉండే అద్భుతమైన ఔషధం. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి మనం వెంటనే చేసే పని ఇదే. కానీ, ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని మీరు తాగే సమయం లేదా పద్ధతి తప్పైతే.. అది మీ శరీరానికి మేలు చేయడం పక్కన పెడితే, కీడు చేసే అవకాశం ఉంది. శతాబ్దాలుగా భారతీయ ఇళ్లలో పసుపు పాలు ఒక సంప్రదాయ ఔషధంగా కొనసాగుతున్నాయి.

రోగనిరోధక శక్తిని పెంచడంలో, గాయాలను మాన్పడంలో, రాత్రిపూట మంచి నిద్రను అందించడంలో దీనికి మించిన చిట్కా లేదని నమ్ముతారు. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థంలోని యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

అయితే ఆరోగ్యకరమైన ఈ పానీయాన్ని తప్పుడు పద్ధతిలో లేదా తప్పుడు సమయంలో తీసుకుంటే శరీరానికి హాని కలుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.చాలా మందికి పసుపు పాలు తాగిన వెంటనే పడుకునే అలవాటు ఉంటుంది. కానీ పాలు జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. పాలు తాగిన వెంటనే నిద్రపోతే జీర్ణక్రియ మందగించి ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. పడుకోవడానికి కనీసం 1-2 గంటల ముందే పాలు తాగడం ఉత్తమం. ఎక్కువ పసుపు వాడితే ఎక్కువ ఆరోగ్యం అనుకోవడం పొరపాటు. పసుపును అధికంగా తీసుకోవడం వల్ల కడుపులో అసౌకర్యం, గ్యాస్, కడుపు నొప్పి, కొన్ని సందర్భాల్లో విరేచనాలు కూడా సంభవించవచ్చు. రోజుకు చిటికెడు లేదా అర స్పూన్ కంటే ఎక్కువ పసుపు వాడకూడదు. కొంతమంది ఖాళీ కడుపుతో



పసుపు పాలు తాగుతుంటారు. సున్నితమైన కడుపు ఉన్నవారికి ఇది సరిపడదు. దీనివల్ల కడుపులో చికాకు, ఎసిడిటీ లేదా అసౌకర్యం కలగవచ్చు. పసుపు పాలలోని పూర్తి ప్రయోజనాలు శరీరానికి అందాలంటే ఒక చిన్న చిట్కా పాటించాలి. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో కొద్దిగా నల్ల మిరియాల పొడి కలపండి. మిరియాలు కలపడం వల్ల పసుపులోని కర్కుమిన్‌ను శరీరం త్వరగా గ్రహిస్తుంది.

## అజీర్తికి చెక్ పెట్టే అద్భుతమైన ఆకులు...!



మన చుట్టూ ప్రకృతి ప్రసాదించిన అనేక మొక్కలు ఔషధ గుణాలను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా మనకు ఈజీగా లభించే కొన్ని రకాల ఆకులు చర్మ సమస్యలకు, జీర్ణక్రియకు అద్భుతమైన పరిష్కారంగా పనిచేస్తాయి. రసాయనాలతో కూడిన ఉత్పత్తుల కంటే, ఇంట్లోనే లభించే ఈ సహజసిద్ధమైన ఆకులను ఉపయోగించడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్యాన్ని, అందాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రస్తుత కాలంలో కాలుష్యం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల చర్మ సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు సర్వసాధారణం అయ్యాయి. వీటికి ఖరీదైన మందులు వాడటమే కాకుండా, మన వంటింట్లో లేదా పెరట్లో దొరికే కొన్ని పచ్చని ఆకులతో శాశ్వత పరిష్కారం పొందవచ్చు. వేపను 'సర్వరోగ నివారిణి' అని పిలుస్తారు.

వేప ఆకులను పేస్ట్‌లా చేసి మొటిమలపై రాస్తే అవి త్వరగా తగ్గిపోతాయి. చర్మంపై వచ్చే వేడి గడ్డలు, ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో వేప అద్భుతంగా పనిచేస్తుంది. తులసి కేవలం పవిత్రమైన మొక్క మాత్రమే కాదు, గొప్ప ఔషధం కూడా. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. తులసి రసాన్ని ముఖానికి రాయడం వల్ల చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది.

## రోజులో ఒక వ్యక్తి ఎంత నెయ్యి తీసుకోవాలి?



గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ చంద్ర ఇటీవలి ఇంటర్వ్యూలో, భారతీయులు ఎంత నెయ్యి, ఎంత నూనె తీసుకోవాలో వివరించారు. అలాగే గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అని కూడా వెల్లడించారు. నెయ్యి, నూనె లేకుండా భారతీయ ఆహారం అసంపూర్ణంగా భావిస్తారు. ఈ రెండూ భారతీయ ఆహారంలో అత్యంత ముఖ్యమైన భాగాలుగా పరిగణిస్తారు. భారతీయ వంటశాలలలో నెయ్యి, నూనె రెండూ మూడు భోజనాలలో ఉపయోగిస్తారు. ప్రతి ఇంట్లో వంట కోసం నూనెను ఉపయోగిస్తారు. రోటీ, కూరగాయలు, పప్పులకు కూడా నెయ్యిని కలుపుతారు. కొంతకాలం పాటు వాణిజ్య నెయ్యిని హానికరమని ప్రజలు భావిస్తారు. కానీ ఇంట్లో తయారుచేసిన దేశీ నెయ్యి చాలా ఆరోగ్యకరమైనదని ప్రజలు భావిస్తారు. దానిని వారి ఆహారంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ చంద్ర ఇటీవలి ఇంటర్వ్యూలో, భారతీయులు ఎంత నెయ్యి, ఎంత నూనె తీసుకోవాలో వివరించారు. అలాగే గుండె ఆరోగ్యానికి మంచిదా కాదా అని కూడా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన నెయ్యి, నూనె పరిమాణం గురించి చర్చించారు. సాధారణంగా భారతీయ సాంప్రదాయంలో నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకుంటారని, పుట్టినరోజు, వివాహం లేదా ఒక కార్యక్రమాల్లో వీటి వాడకం ఎక్కువగా ఉంటుందన్నారు. గతంలో ప్రత్యేక సందర్భాలలో సంవత్సరానికి ఐదు నుండి ఆరు సార్లు మాత్రమే వేయించిన ఆహారాన్ని తినేవారు. ఇతర రోజులలో, ప్రజలు సాత్విక లేదా పచ్చి ఆహారాన్ని తినేవారు. నెయ్యి, నూనెలను ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు పెరిగిపోయాయని అన్నారు.దేశీ నెయ్యి, కూరగాయల నూనె మంచివని, కానీ అవి హైడ్రోజనేటెడ్ కాకపోతే మాత్రమే అని డాక్టర్ వివరించారు. ఏదైనా నూనెను హైడ్రోజనేషన్ చేయడం వల్ల ధాన్యంలా, తెల్లగా మారుతుంది. ఇది అనారోగ్యకరమైనది. డాక్టర్ ప్రవీణ్ చంద్ర ప్రకారం, మీరు రోజంతా 1 నుండి 2 టీస్పూన్ల నెయ్యిని తీసుకోవచ్చు. ఉదాహరణకు ఒక టీస్పూన్ నెయ్యి, ఒక టీస్పూన్ నూనె. కూరగాయల నూనెలు ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. కానీ జంతువుల కొవ్వుతో తయారు చేసిన నూనెలు హానికరమైనవి. ఎందుకంటే అవి అధిక మొత్తంలో సంతృప్త కొవ్వును కలిగి ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని తెలిపారు.

## రెబెల్ స్టార్ ఫౌజీ.. ఆ సీన్స్ మాములుగా ఉండవట




ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రాలలో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' ఒకటి. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ ఆర్మీ సైనికుడిగా కనిపించనున్నాడు. అయితే, హను రాఘవపూడి 'సీతారామం' వంటి క్లాసిక్ లవ్ స్టోరీలను తెరకెక్కించడంలో దిట్ట. ఇప్పుడు ఫౌజీ కూడా అలాగే ఉండబోతుందని తెలుస్తోంది. నిజానికి ఈ సినిమా యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా రానుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. లేటెస్ట్‌గా.. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చే యాక్షన్‌తో పాటు.. ప్రభాస్, హీరోయిన్ ఇమాన్వి మధ్య వచ్చే రొమాన్స్ మరియు ఎమోషనల్ లవ్ స్టోరీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. యాక్షన్, ఎమోషన్, రొమాన్స్‌ను సమపాళ్లలో కలిపి హను రాఘవపూడి ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారట. ముఖ్యంగా ప్రభాస్ సైనికుడి లుక్ మాత్రం మామూలుగా ఉండదని టాక్. ఇప్పటి వరకు ప్రభాస్ ఇలాంటి పాత్రలో కనిపించలేదు.

## అన్ని వర్గాలను అలరించే సరికొత్త ప్రేమకథ...


హర్షిత్ రెడ్డి హీరోగా నటించిన నయా సినిమా 'దీవాన'. అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి ఈ సినిమాతో పరిచయం కానున్నారు. ఈ సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి మీడియాతో పలు సినీ విశేషాలను షేర్ చేసుకున్నారు. పదేళ్ల కిందట వచ్చిన ప్రయో గాత్మక చిత్రం 'మిణు గురులుచిత్రానికి అసిస్టెంట్ గా పనిచేశా. పదేళ్లకుపైగా ఓ కార్పొరేట్ కంపె నీలో ఉద్యోగం చేశాను.

చిన్న డెమో ఫిల్మ్స్, సాంగ్స్, షార్ట్స్ ఫిల్మ్స్ చేశా. ఈ 'దివాన కథ జెమిని టీవీలో ఓ యాంకర్ ను చూసి రాసుకున్నా. ఆమె రోజూ టీవీలో వచ్చేంది. ఎంబీఏ పూర్తి చేశాక జాబ్ కోసం ప్రయత్నించకుండా సినిమా కోసం ఆగిపోయా. పొద్దున లేస్తే టీవీ చూస్తుండగా యాంకర్ కనిపించింది. వెళ్లి ఆ అమ్మాయిని కలిస్తే ఎట్లుండది, కలిస్తే ఏమవ్వొచ్చు, గుర్తుతెలియని వ్యక్తి వెళ్లి కలిస్తే ఏం జరుగుతుందనే ఆలోచన తట్టింది. దీంట్లో ఏమోషనల్ ప్లస్ కమర్షియల్ కథ ఉంది. ఇది రాయాలని అనుకున్నా. నా కథలో హీరోది వన్ సైడ్ లవ్వే. ఎక్స్ట్రోవర్ట్ గా హీరోయిన్ వెనుక పడుతుంటాడు. సెకండాఫ్ లో వన్ సైడ్ లవ్వే ఉంటుంది కానీ వెనుక పడేది ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే సరికొత్త



ప్రేమకథ ఇది. ఇలాంటి ప్రేమకథని చూసి ఉండరు. ? ఈ సినిమాలో ఆరు పాటలుం టాయి. మూడు ఫైట్లు ఉంటాయి. ప్రతి మనిషిని టార్గెట్ చేసి తీసిన సినిమా ఇది. లవ్, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎమోషన్స్ బాగా నచ్చుతాయి. ఈ కథకి హర్షిత్ రెడ్డి పక్కా యాప్ట్. ఇందులో తను ఎంతో బాగా నటించాడు. అలాగే మా కథానాయిక స్నేహ మణిమేగలై కూడా అద్భుతంగా నటించింది.

## రీఎంట్రీ ఇస్తున్న 'గ్లామర్ బ్యూటీ'.....!



దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది ప్రముఖ నటి "హన్సిక". బాలనటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆమె, చిన్న వయస్సులోనే ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నారు. ఎన్టీఆర్‌తో 'కంత్రి', రామ్‌తో 'మస్కా'.. 'సీతారాముల కళ్యాణం', 'సమ్‌థింగ్ సమ్‌థింగ్', ఓ మై ఫ్రెండ్.. వంటి వరుస క్రేజీ ప్రాజెక్టులతో టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ గా ఎదిగింది. కేవలం తెలుగులోనే కాకుండా కోలీవుడ్‌లోనూ స్టార్ హీరోల సరసన నటించి జూనియర్ ఖుష్బూగా పేరు సంపాదించుకుంది. అయితే కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న సమయంలోనే హన్సిక డిసెంబర్ 2022లో ప్రముఖ వ్యాపారవేత్త సోహెల్ ఖతురియాను అంగరంగ వైభవంగా వివాహం చేసుకుంది. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే తీవ్ర అభిప్రాయ భేదాల వల్ల జూలై 2024 నుంచి వీరిద్దరూ విడిగా ఉంటున్నట్లు వార్తలు వచ్చాయి. మనస్పర్థలు తొలగకపోకపోవడంతో, పరస్పర అంగీకారంతో విడిపోవడమే మంచిదని చివరకు భావించారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com